
జన రాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 6 పక్షపత్రిక మార్చి 16-31, 2017








నగర పాలనలో హైదరాబాద్ ఫెయిల్ - 'వికేంద్రీకరణ' పరిష్కారం చూపుతున్న తార్నాక సంక్షేమ సంఘం

## ఉపాధిని కులం దాటనివ్వని దివాళాకోరు రాజకీయం



'చెత్త చదువుల' పాలకుల వల్లే ఇంకా వివక్ష




తీర్పు @ 5






## ఆలోచన, తపన, విజ్ఞత పెంచుకోండి : యూత్‌తో జేపీ

సరైన ఆలోచనాతీరు, తపన, విజ్ఞతతో యువత కలల్ని సాకారం చేసుకోవాలని, జాతి నిర్మాణం చేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ప్రపంచం శరవేగంగా మారిపోతోందని, సాంకేతికంగా వస్తున్న మార్పుల్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ ఎదగాలన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను తెలుసుకుంటుండాలని, వృథా ఖర్చు చేయకుండా జాగ్రత్తపడాలని అన్నారు. పిల్లల చదువుల కోసం ఎన్నో త్యాగాలు చేసే తల్లిదండ్రులున్నా వారిని సరైన దిశలోకి మళ్లించే పాలకులు మనకు లేకపోవటం దురదృష్టకరమన్నారు. ప్రజల కోసం, భావి తరాల కోసం పనిచేయకుండా, వ్యక్తిగత లబ్ధి కోసమే పాలకులు పనిచేస్తున్నారన్నారు. కొందరు నాయకులకు వ్యక్తిగత చిత్తశుద్ధి ఉన్నా దూరదృష్టి లేకపోవటం వల్ల దేశానికి నష్టం జరుగుతోందన్నారు. సరైన ఏర్పాట్లు లేకుండా చేసిన పెద్దనోట్ల రద్దు అలాంటిదేనన్నారు. అందుకే యువత సరైన ఆలోచనాతీరు, తపన, విజ్ఞత ఉన్న రాజకీయ నాయకుల్ని ఎన్నుకోవాలని, అలాంటి నాయకులుగా తయారవ్వాలని అన్నారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలం జొన్నాడలోని లెండి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవంలో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చెన్నైకి చెందిన హెక్సావేర్ కంపెనీ ఉపాధ్యక్షుడు స్టీఫీజార్జి, కళాశాల ఛైర్మన్ పి. మధుసూదనరావు, వైస్ ఛైర్మన్ పి. శ్రీనివాసరావు, కార్యదర్శి కె.శివరామకృష్ణ, ప్రధానాచార్యులు డాక్టర్ వి.వి. రామారెడ్డి, విద్యార్థి సంఘం నాయకుడు జి. రాజశేఖర్, పూర్వ విద్యార్థి దిలీప్, విభాగాధిపతులు వై.నరేంద్రకుమార్, ఎం.రాజన్‌బాబు, కె.వి. నర్సింహం, శ్రీకిరణ్, ఎ. రామారావు, టి.హరిబాబు, జి. ప్రకాష్ బాబు, అధ్యాపకులు జ్యోతి, వినయ్, రోజా, శ్యామ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక మార్చి 16-31, 2017

సంపుటి - 8 సంచిక - 6

## లోపలి పేజీల్లో...

తీర్పు @ 5: మోదీ ఎన్నికల............... 5

ఉపాధిని కులం దాటనివ్వని............... 6

కులం తెగులుతో నవ్యాంధ్ర ................ 16

సామాజిక న్యాయమే ప్రగతికి సోపానం.. 18

మళ్లీ మనమే నెం. 1 ........................ 21

అవినీతిని రద్దు చేయలేకపోయిన......... 23

పౌరసమాజాన్ని ఎమ్మెల్సీలుగా ............ 24

అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజంట్లకు....... 25

కలిఖో బాంబు............................... 26

డెల్టాల్లో రాజకీయ పూడిక.................. 28

ఏటా ఒక్కో పౌరునిపై రూ.4207........ 30

మార్పు తెచ్చే నాయకులు కావాలిప్పుడు.. 32

పుట్టుకతో వివక్ష కొనసాగింపు ........... 33

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

## సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# ట్రంప్‌ను వేలెత్తి చూపే ముందు..

అమెరికా నుంచి మూడు లక్షలమంది భారతీయులను వెనక్కిపంపించే ప్రయత్నం, కొన్ని చోట్ల జాతి విద్వేష దాడులు మనదేశంలో పెద్ద చర్చనీయాంశమయ్యాయి. 'అమెరికా వెళ్లినవాళ్ల తిక్కకుదిరింది' అని అక్కడికి వెళ్లటానికి అవకాశం లేని పలువురు భారతీయులు డీమానిటైజేషన్ సమయంలోలా లోలోపల సంతోషిస్తుండగా, కొందరు తమవారి కోసం, తమ అవకాశాల కోసం ఆందోళన చెందుతున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీద దుమ్మెత్తిపోస్తూ ఇంత పెద్ద చర్చ చేయటం ప్రాచుర్య మీడియాకహెడ్‌లైన్స్‌కి ఉపయోగపడవచ్చు కానీ.. మనదేశానికి, చివరకు ఎన్నారైలకు కూడా పెద్దగా ఒరగబెట్టేదేమీ ఉండదు. కుటుంబ వ్యవస్థ బలహీనంగా ఉండటం, తుపాకుల సంస్కృతి వల్ల అమెరికాలో ఇలాంటి దాడులు అడపాదడపా చాలా కాలం నుంచే జరుగుతున్నాయి. ఆటోమేషన్‌తో ఉద్యోగాలు, ఆదాయం కోల్పోయిన సగటు అమెరికన్ ఆగ్రహాన్ని ఒక వ్యాపారవేత్తలా తన రాజకీయ అవసరాలకు వాడుకున్న ట్రంప్ అధ్యక్షుడిగా కావటం వల్ల అటువంటి దాడులకు ఒక లైసెన్స్ వచ్చినట్టయి ఉండవచ్చు. కానీ ట్రంప్‌కు ఓట్లు పడ్డాయి, ఆయన ఎన్నికల సమయంలో ఏం చెప్పారో అదే చేస్తున్నారు, ప్రతిపక్షం కూడా కొంత మద్దతిస్తోంది అని మనం మర్చిపోకూడదు. మనదేశంలో 2014 ఎన్నికల్లో అరుదైన అవకాశాన్ని పొందిన నరేంద్ర మోదీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే అమెరికా, కొన్ని పాశ్చాత్య దేశాల్లో ప్రవాస భారతీయులతో అట్టహాసంగా కార్యక్రమాలు నిర్వహించారు. మేకిన్ ఇండియాకు ఎప్పుడైతే ఎన్నారైల నుంచి పెద్దగా మద్దతు లభించలేదో ఆయన అలాంటి కార్యక్రమాలను తగ్గించినట్టు కనిపిస్తుంది. కానీ సగటు అమెరికన్లలో ఆ ప్రభావం చెరిగిపోలేదు. అటు అమెరికాను, ఇటు భారత్‌ను సొంత దేశాలుగా భావించి అందరికీ ఎదిగే అవకాశాల కోసం, అందరినీ కలుపుకుని పనిచేయకుండా కులం, మతం, ప్రాంతం, భాష పేరుతో చాలామంది ఎన్నారైలు అపరిపక్వతతో, తాత్కాలిక ధోరణితో వ్యవహరించటం వల్ల.. వారి ద్వంద్వ పౌరసత్వం స్వదేశంలో, విదేశంలోనూ అపార్థాలకు, వ్యతిరేకతకు దారితీసింది. సుమారు 73,000 సంవత్సరాల క్రితం అందరం ఆఫ్రికా నుంచే వలస వచ్చినవారమే. కాబట్టి భారత్ మూలాలున్నా అమెరికా ప్రయోజనాల కోసమే ఆలోచిస్తామని గిరి గీసేసుకున్న బాబీ జిందాల్ లాంటి వారికన్నా.. అమెరికాలోగానీ, మరోదేశంలోగానీ ద్వంద్వ/బహుళ పౌరసత్వ భావనగల ఎన్నారైలు మెరుగైనవారనటంలో సందేహం లేదు. వీరు కొన్ని తక్షణ జాగ్రత్తలతో అందర్నీ కలుపుకునే లోతైన ప్రజాస్వామిక అవగాహనతో వ్యవహరిస్తే చాలు.. వ్యవస్థ సాయంతో విద్వేష వివాదాల్ని చాలామేర పరిష్కరించుకోవచ్చు. ఇక అమెరికాలో ఉద్యోగావకాశాలు పోగొట్టుకుంటారనుకుంటున్న వారిలో ప్రతిభ వున్నవారు ఎక్కడున్నా, భారత్‌కు తిరిగొచ్చినా ఏదోకరకంగా ఉపాధి పొందగలరు. కానీ మన దేశం ముందున్న సమస్య ఈ మొత్తం కంటే భయంకరమైనది. ఎన్నారైల మూడు లక్షల ఉద్యోగాల గురించి తెగ మాట్లాడేస్తూ ట్రంప్‌ని వేలెత్తి చూపుతున్నాంగానీ.. మనదేశంలో నెలకు 10లక్షల ఉద్యోగాలను సృష్టించాలన్న పెనుసవాలును పట్టించుకోవటం లేదు. మోదీ, చంద్రబాబు, కేసీఆర్ సహా అధికారంలో ఉన్నవారు ఇప్పటిదాకా 3కోట్ల 30లక్షల ఉద్యోగాలను సృష్టించాల్సి ఉండగా, అందులో వందోవంతు కూడా సృష్టించలా. అధికారిక గణాంకాలు సైతం లేకుండా చేస్తున్నారు. ఇటీవల విడుదలైన ఓఈసీడీ (ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ) ఆర్థిక సర్వే ప్రకారం మనదేశం 7శాతం వృద్ధి రేటును సాధిస్తున్నా, ఉద్యోగాల విషయంలో ఘోరంగా వెనకబడుతోంది. భారత్‌లో పనిచేయగలిగే శక్తి గల 15-29 ఏళ్ల మధ్య వయసున్న యువతలో 30శాతం మందికి పైగా ఉద్యోగాలు, చదువులు, శిక్షణ ఏవీ లేనివారంటే.. మన మానవవనరులు అపారంగా వృథా అవుతున్న తీరు గుండెల్ని పిండేయకమానదు. కండల్లో శక్తి, గుండెల్లో బలం ఉన్నా యువతకి ఉపాధి అవకాశాలు కల్పించకపోవటం కంటే నేరనిర్లక్ష్యం ఉంటుందా? ఇలాంటి వారు చైనాలో కంటే మూడింతలు ఎక్కువగా మనదేశంలో ఉన్నారు. ఓఈసీడీలో 35 సభ్య దేశాలున్నాయి. ఈ దేశాల సరాసరి (14.56) కంటే కూడా భారత్‌లో వృథా యువశక్తి రెట్టింపుగా ఉంది. ఉపాధి ఉన్నవారిలో కూడా అత్యధికులు అసంఘటిత రంగంలో ఉన్నారు. మనదేశంలో నాణ్యమైన విద్య లేకపోవటం, ఇస్తున్న నైపుణ్యాలు మొక్కుబడిగా ఉండటం, పనిచేసినా చేయకపోయినా తొలగించలేనిరీతిలోని కార్మిక చట్టాలు తదితర కారణాల వల్ల ఉపాధి లేని యువత గుదిబండలా తయారవుతున్నారని నివేదిక తెలిపింది. ఇదే ఓఈసీడీ 2012లో మన పాఠశాల విద్యా ప్రమాణాలపై (పీసా) నివేదిక ఇస్తూ.. 74దేశాలలో భారత్ అట్టడుగున 73వ స్థానంలో ఉందని తెలిపింది. విద్యావ్యవస్థ వైఫల్యం వల్ల ఉపాధి రహిత వృద్ధితో యువ భారత్ అగ్నిపర్వతంలా తయారవుతోందని తాజా సర్వే కూడా హెచ్చరిస్తోంది. గ్రామాలు-పట్టణాలు మధ్య అంతరాన్ని తగ్గించేందుకు వ్యవసాయాన్ని లాభసాటి చేసే ఉత్పాదక, మార్కెట్ సంస్కరణలు, మౌలిక వసతుల నిర్మాణం, పట్టణీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటానికి మునిసిపాలిటీలకు అధికార వికేంద్రీకరణ, పౌరసేవల నాణ్యత వంటి సూచనల్ని కూడా ఈ సర్వే చేసింది. మోదీ, ముఖ్యమంత్రులు ఎన్ని చెప్పినా సరైన విధానాలు లేకపోవటం వల్ల దేశంలో అవినీతి ఏమాత్రం తగ్గలేదని మరోవైపు ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సర్వే చెప్పింది.. ఈ సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఈ వివరాల్ని పేర్కొంటున్నాంగానీ, లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా నిర్దిష్ట పరిష్కారాలతో ఈ సమస్యలపై పోరాడుతోంది. ఇప్పటికీ నిర్లక్ష్యం చేస్తే భారీ నష్టంతో కొన్నేళ్ల తర్వాతా ఇవే చేయాల్సి ఉంటుంది. మన చేతుల్లో లేని విదేశాల్లో విషయాల మీద అనవసర ఆసక్తుల్ని తగ్గించుకుని, మనం మన దేశంలో చేయాల్సిన ఈ సంస్కరణల మీద దృష్టి పెట్టటం మేలు. వేరే దేశాల్లో గొప్ప కృషి చేస్తూ సెనేటర్లుగా, మేయర్లుగా నాయకత్వాన్ని అందిస్తున్న ఎన్నారైలు కూడా తమ శక్తిసామర్థ్యాలను స్వదేశం కోసం వినియోగించటంపై ఆలోచన చేయాలి. భారత్‌కు అన్నీ ఉన్నాయి, యువశక్తి అదనపు బలం. కావలసిందల్లా - ఎక్కడికక్కడ సరైన నాయకత్వం. సొంత సంపాదన చూసుకుంటూ ఆ బాధ్యతను ఎన్నారైలు లాంటి వారు తీసుకోగలరు. ఐదు రాష్ట్రాల ఎన్నికలయ్యాయి కాబట్టి, మోదీ కూడా ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళన సహా ఈ సంస్కరణల కోసం మిగిలిన సమయాన్నయినా సద్వినియోగం చేయాలి.

మీ

# కార్టూన్ కార్నర్




**నీవు రూ. వెయ్యి నుంచి కోటి రూపాయల వరకూ ఎంతైనా అడగొచ్చు కానీ, నేను ఇచ్చినంతే తీసుకోవాలి!**

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు


| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# తీర్పు @ 5: మోదీ ఎన్నికల విజయం దేశ సంస్కరణల విజయం కావాలి: జేపీ

ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో నరేంద్ర మోదీ అద్భుతమనదగ్గ విజయం సాధించారని, అధికారం, ప్రజాబలం పుష్కలంగా ఉన్న మోదీ ఇకనైనా అభివృద్ధి, విద్య, ఆరోగ్యం, అవినీతి, పౌరసేవలు, స్థానిక ప్రభుత్వాలు, చట్టబద్ధ పాలనపై సంపూర్ణంగా దృష్టి సారించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఉత్తర ప్రదేశ్ ఎన్నికలను జాతీయ స్థాయి ఎన్నికలుగా మోదీ మార్చగలిగారని, సువిశాలమైన, సంక్లిష్ట భిన్నత్వాలున్న భారత్ వంటి దేశానికి దిశానిర్దేశం చేసే అసాధారణ అవకాశం చరిత్ర మోదీకి కల్పించిందని అన్నారు. తనకు లభించిన అవకాశానికి తగ్గట్టు మోదీ నాయకత్వ పాటవాన్ని ప్రదర్శించి సంస్కరణల లక్ష్యాన్ని సాధించాలన్నారు.

యూపీలో మొత్తం సీట్లు 403కాగా, బీజేపీ కూటమికి 325, ఎస్పీ–కాంగ్రెస్‌కు 54, బీఎస్పీకి 19, ఇతరులకు 5 వచ్చాయి. పంజాబ్‌లో మొత్తం స్థానాలు 117కాగా, కాంగ్రెస్‌కు 77, ఆప్‌కి 20, అకాలీ–బీజేపీకి 18, ఇతరులకు 2 వచ్చాయి. ఉత్తరాఖండ్‌లో మొత్తం స్థానాలు 70. బీజేపీకి 57, కాంగ్రెస్‌కు 11 వచ్చాయి. మణిపూర్‌లో సీట్లు 60. కాంగ్రెస్ 28, బీజేపీ 21, టీఎంసీ 1, ఇతరులు 10 గెలుచుకున్నారు. గోవాలో 40స్థానాలకు కాంగ్రెస్ 17, బీజేపీ 13, ఇతరులు 10 గెలుచుకున్నారు.




**ఆమోదించకపోయినా క్షమించారనుకోవచ్చు**

డబ్బున్నవారికి ఎంతో కొంత నష్టం జరిగిందనే సంతృప్తి, మోదీ సదుద్దేశంతో చేశారన్న భావన, మెరుగైన జీవితం పట్ల ఆశతోనే చాలామంది పేద, మధ్యతరగతివారు తాము ఎంత ఇబ్బంది పడ్డా పెద్ద నోట్ల రద్దుపై మోదీని క్షమించి యూపీ ఎన్నికల్లో ఓట్లు వేశారని విశ్లేషకుల అంచనా. మూడు నాలుగు రాష్ట్రాల పెట్టయిన యూపీలో.. సామాజిక న్యాయాన్ని కులం స్థాయికి, సోషలిజాన్ని తాత్కాలిక తాయిలాల స్థాయికి దిగజార్చిన నేతల డొల్లతనాన్ని మోదీ బద్దలు కొట్టగలిగారు. మోదీ పార్టీ కూడా కుల, మత ఫార్ములాను ఏదోకరకంగా ఉపయోగించినప్పటికీ, ఈసారి యూపీ ఎన్నికల్లో మోదీ అవినీతిరహిత వ్యక్తిత్వం, సుపరిపాలన నినాదాలే ప్రధాన ఇరుసుగా గెలిపించాయి. దానికితోడు రెండేళ్లుగా చాప కింద నీరులా బీజేపీ చేస్తున్న సంస్థాగత ఏర్పాట్లు, ముస్లింల ఓట్ల కోసం లౌకిక ముసుగులో పలుపార్టీలు పోటీపడటం, కాంగ్రెస్ నిరాసక్తత, భారీ వినూత్న ప్రచారం మోదీ విజయాన్ని గురితప్పకుండా చేశాయి. యూపీ, ఉత్తరాఖండ్‌లు దాటి మిగిలిన మూడు రాష్ట్రాలు – పంజాబ్, గోవా, మణిపూర్‌లో వచ్చిన ఫలితాలు బీజేపీకి పెద్ద నష్టం కలిగించకపోయినా, మోదీ మ్యాజిక్‌ను మించిన అంశాలు కూడా జనం తీర్పుల్ని ప్రభావితం చేయగలవనే పరోక్ష హెచ్చరికల్నిస్తున్నాయి. పంజాబ్‌లో కేజ్రీవాల్ స్వయంకృతంతో 'ఆప్' కుదేలవటం మోదీకి అక్కడ ఓటమిలోనూ ఊరటనిచ్చింది. మరోవైపు, చేతలు లేని మోదీ మ్యాజికల్ ఫార్ములా దక్షిణాది రాష్ట్రాలలో పెద్దగా పని చేయకపోవచ్చని కూడా పరిశీలకులు భావిస్తున్నారు.

**డీమానిటైజేషన్ కూడా ఆపలేని డబ్బు ప్రవాహం**

పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) చేసినా ఎన్నికల్లో నల్లడబ్బు ప్రవాహం ఆగలేదని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఐదు రాష్ట్రాల్లోనూ 2012లో ఎన్నికల కంటే దాదాపు రెట్టింపు అనుమానిత నగదు, ప్రలోభాలు ఈసారి పట్టుబడ్డాయి (వాస్తవ నల్లడబ్బులో ఇది 1శాతం కూడా ఉండదు). యూపీలో 2012లో రూ.36.29కోట్లు పట్టుబడగా, 2017లో ఇంకా రెండు దశల పోలింగ్ ఉండగానే, రూ.115.70కోట్లు పట్టుబడ్డాయి. అలాగే పంజాబ్‌లో గత ఎన్నికల్లో రూ.11.51కోట్లు పట్టుబడగా, ఇప్పుడు రూ.58.02కోట్లు దొరికాయి. మిగతా దోపిడీ నేతలతో పోలిస్తే తాను నిజాయతీపరుడన్నే ఉద్దేశంతోనే నోట్ల రద్దుపై తన అవగాహరాహిత్యాన్ని ప్రజలు క్షమించి అవకాశమిచ్చారని మోదీ మర్చిపోకూడదు. నోట్ల రద్దుకు కొనసాగింపుగా అవినీతి అంతానికి సంస్కరణలు తీసుకురాకపోతే, అదో వృథాప్రయాసగా మిగిలిపోయి సామాన్యుల్లో కూడా వ్యతిరేకత ప్రబలే ప్రమాదముందని గుర్తించాలి. తాను చరిత్రలో నిలిచిపోతూ బీజేపీని సామాన్యుల పార్టీగా తీర్చిదిద్దాలన్న మోదీ కల నెరవేరాలంటే, నల్లడబ్బు – అవినీతి నియంత్రణకు కీలకమైన ఎన్నికల సంస్కరణల్ని, పైస్థాయిలో బలమైన అవినీతి నిరోధక చట్టాన్ని, దిగువన పౌరసేవల చట్టం వంటి ఏర్పాట్లని తీసుకురావటం తప్ప మరో మార్గం లేదు. ❍

# ఉపాధిని కులం దాటనివ్వని దివాళాకోరు రాజకీయం



రాష్ట్ర విభజనను అవకాశంగా వినియోగించుకోలేక పాత విధానాలనే కొత్తరంగుతో అమలు చేస్తున్న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వచ్చే ఎన్నికల్లో గెలవటానికి ముమ్మర కుల రాజకీయాల మార్గాన్ని ఎంచుకున్నారు. ఎన్నికల్లో గెలవటానికి తాయిలాల పథకాలు, ఉచితాలు సరిపోకపోతే కులం, మతం, ప్రాంతం వంటివి వినియోగించే రాక్షస రాజకీయ క్రీడలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, కె. చంద్రశేఖరరావు ఈసారి కులం కార్డును పెద్దఎత్తున వినియోగించనున్నారు. అందుకే కుల వైరస్‌కి అదనపు బలాన్నిస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో పెద్దసంఖ్యలో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలను అందించలేక, ఆ వైఫల్యాన్ని కులం నిషా పెంచి మరపించాలని చూస్తున్నారు. పేలవమైనఉపాధి కార్యక్రమాలకు కులం కలర్ అద్ది మైమరపించే ప్రయత్నం చేస్తున్నారు.

*తెలంగాణలో కేసీఆర్ ఇటీవల ప్రకటించిన కులవృత్తుల ప్రోత్సాహ కార్యక్రమం ఈ తాజా కుల రాజకీయ కోణానికి సంబంధించి ఓ కేస్ స్టడీ.*

తెలంగాణ ఉద్యమ సమయంలో యువత ఆశించినంత ఉపాధిని రాష్ట్రం ఏర్పడి మూడేళ్లవుతున్నా అందించలేకపోవటంతో, నిరుద్యోగుల్లో అసహనం పెరుగుతుండటంతో కేసీఆర్ ఆ అంశానికి సంబంధించి కొత్త పథకాలు ఆలోచించటంలో తప్పు లేదు. అలాగే గ్రామాల నుంచి వలసలు పెరగకుండా చేతివృత్తులకు ప్రోత్సాహం ఇవ్వాలనుకోవటమూ తప్పు కాదు. అవసరం కూడా. కానీ వృత్తికి, కులానికి లంకె పెట్టటమే అసంబద్ధం, అనాగరికం. సుమారు 3,000 ఏళ్ల క్రితం మొదలైన కులవ్యవస్థ వల్ల ఈ దేశంలో ఎన్ని కోట్లమంది నివారించదగ్గ బాధలకులోనై అమానుష జీవితాల్ని గడిపారో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కులానికి–వృత్తికి ఉద్దేశపూర్వకంగా ముడి వేయటం వల్లే కులవ్యవస్థ ఘనీభవించిందనే చారిత్రక అధ్యయనాలున్నాయి. అలాంటి కులవ్యవస్థను వృత్తితో మళ్లీ బలోపేతం చేయాలనుకోవటం, కేవలం పుట్టుకను బట్టే బిడ్డల జీవితం నిర్ణయమైపోతుందనటాన్ని ఆమోదించటం ఆటవిక రాజకీయాన్ని కొనసాగించటమే అవుతుంది.

చేతివృత్తుల్లో ఎక్కువ కులవృత్తులుకాగా, కులవృత్తుల్లో ఉన్నవారిలో ఎక్కువమంది వెనకబడిన, షెడ్యూల్డ్ తరగతుల (బీసీ, ఎస్సీ)లలో ఉన్నారు. ఆ కులాల్లోవారు చదువుకోవాలని కూడా చెబుతూ ప్రత్యేకంగా గురుకులాల్ని సైతం కేసీఆర్ ప్రకటించారు. ఆ కులాల్లోనివారిలో ఉపాధి లేని వారిని, కులవృత్తులు లాభసాటికానివారికి కూడా ఉపాధి కల్పించే ఆలోచనలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ దిశగా బడ్జెట్ కేటాయింపులిచ్చారు.. ఈ మొత్తంలో అసలు అంశం ఉపాధి. అలాంటప్పుడు కులంతో సంబంధం లేకుండా.. ఉపాధి అవసరమున్న అందరికీ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వృత్తుల్లో అవకాశం కల్పించకుండా ప్రభుత్వం అంతా కులం చుట్టూనే ఎందుకు తిప్పుతోంది?

ప్రభుత్వ శాఖలలో కొనుగోళ్లు వంటి పద్ధతుల ద్వారా కొన్ని వృత్తుల ఉత్పత్తులకు చేయూతనివ్వొచ్చు. అలాగే మాంసం, ఇతర కొన్ని ఉత్పత్తులకు మంచి గిరాకీయే ఉంది కాబట్టి కొన్ని వృత్తులకు మార్కెట్ అవకాశాల్ని విస్తృతపరచవచ్చు. కానీ, మార్కెట్‌లో డిమాండ్‌లేని వృత్తులకు కృత్రిమంగా డిమాండ్‌ను చూపించే ప్రయత్నం చేస్తే ఆ వృత్తులవారంతా మళ్లీ లేనిపోని భ్రమల్లో బతుకుతూ రాబోయే కాలంలో తిరిగి దెబ్బతింటారు. కులవృత్తిలో కొనసాగాలనుకుంటున్నవారిని అడ్డుకోనక్కర్లేదు, కానీ దాన్నుంచి నుంచి బైటికొచ్చి మెరుగైన వృత్తిని చేపట్టగలిగే ఆసక్తి, సత్తా ఉన్న యువత కూడా నిర్వీర్యమైపోయే ప్రమాదముంది. కులానికి, వృత్తికి ఉన్న లంకెను ప్రోత్సహించటం వల్ల వాళ్లు పరిమిత ఆదాయంతో ఆ వృత్తిలోనే మగ్గిపోయే అవకాశాలు ఎక్కువుంటాయి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీలకు వృత్తిపరమైన సాయం కోసం 'ఆదరణ'

## ఎవరూ అనుకుని పుట్టరు

ఫలానా కులంలో పుట్టాలని ఎవరూ అనుకుని పుట్టరు కాబట్టి.. కులం పేరు మీద ఎవరినీ తప్పు పట్టలేం. అలాగే మన చుట్టూ మన కులస్తులే ఉన్నా అందుకూ తప్పుపట్టలేం. యాదృచ్ఛికంగా ఒక కులంలో పుట్టినప్పుడు, ఆ కుటుంబంలో, బంధువర్గంలో ఆ కులస్తులే ఎక్కువగా ఉంటారు. కులం పట్ల మమకారంతోనో, చివరికి పిచ్చితోనైనా వారు మనకు సాయం చేస్తే తీసుకోవటానికి కూడా సంకోచించనక్కర్లేదు. ముఖ్యంగా బలమైన వ్యక్తులు, సంస్థలు ఇచ్చే సాయాన్ని కులం కారణంగా తోసిపుచ్చటం వల్ల ఆచరణలో చాలా సందర్భాల్లో నష్టమే తప్ప లాభం ఉండదు. కానీ ఈ మొత్తంలో కుల వ్యవస్థని ఘనీభవింప చేసేట్టు మనం వ్యవహరిస్తున్నామా? లేక కులరహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్నామా? .. మన విధానాలు, ప్రవర్తన ఏరీతిలో వున్నాయి? అన్నవే అసలు ప్రశ్నలు.

అలాగే కులాన్ని దాటి వ్యవహరించలేక కులసంఘాలుగా పోరాడే అస్తిత్వ ఉద్యమాలలోనూ కొన్ని సందర్భాల్లో పాల్గొనవచ్చు. కానీ కుల ఉద్యమాలను కులాతీతంగా మార్చే ఎజెండా వైపు మళ్లించేందుకు అందులో పాల్గొన్నామా? లేక కులవ్యవస్థను కొనసాగించి లబ్ధి పొందటం కోసం పాల్గొన్నామా? అనేవి ప్రశ్నలు. కులవ్యవస్థ వల్ల అమానుషమైన రీతిలో దేశ జనాభాలో అత్యధికులు హీనమైన, అవమానకరమైన జీవితాల్ని గడిపినా, ఇంకా కులవ్యవస్థను ఘనీభవింప చేసేలా వ్యవహరించటం ఎన్ని దానధర్మాలు చేసినా, ఎంతమంది దేవుళ్లను పూజించినా దుర్మార్గమే అవుతుంది.



వంటి పథకాలను అమలుచేయగా, ఇప్పుడు తెరాస ప్రభుత్వం బీసీ కులాలకు వృత్తిపరమైన సాయం పేరుతో బీసీలు= కులాలు అనే కుల రాజకీయ భావనకు తెరతీసింది.

ఆచరణాత్మకమైన మెరుగైన పరిష్కారాలే లేనట్టు కేసీఆర్ కులాన్ని తిరిగి పెంచి పోషించే ప్రయత్నం చేస్తున్నారు.

'వాళ్లకు చదువు కూడా ఇస్తున్నాం' అని చెప్పుకోవటానికి వీలుగా అణగారిన కులాలకు ఏవో కొన్ని గురుకులాల్ని పేరుకు ప్రారంభించి వదిలేయకుండా.. కచ్చితంగా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం (పౌష్టికాహారం సహా) అందించే ఏర్పాటు చేసి, అలా చదువుకున్నవాళ్లు తమకు నచ్చిన రంగాన్ని, ఉపాధిని ఎంచుకునే స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించాలి. మెరుగైన మార్కెట్ అవకాశాలకు సంస్కరణల్ని అమలుచేయాలి. లాభాలకవకాశమున్న కులవృత్తుల్లో ఆ కులం వారే ఎక్కువ ఉన్నా కుల ప్రస్తావన లేకుండానే ప్రోత్సహించవచ్చు. కానీ కొత్తగా ఏ కులంవారైనా ఆ వృత్తిలోకి ప్రవేశించగలిగే అవకాశం కల్పించాలి. తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రుల బిడ్డలకు లభించిన చదువు, వేరే వృత్తులు, వ్యాపారాలు చేసుకునే అవకాశాలు ప్రతి తెలంగాణ బిడ్డకూ లభించాలి. ఉపాధి అవకాశాల్ని ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి తేవటానికి రాజధాని నుంచి అభివృద్ధిని, పాలనను వికేంద్రీకరించి స్థానికంగానే స్వయంపాలనకు నిధుల్ని అందుబాటులోకి తేవాలి. 'గ్రామజ్యోతి' వంటి కార్యక్రమాల్లో నిర్లక్ష్యాన్ని వీడాలి.

సాగునీరు, ఇతరత్రా వనరులు ఉన్న ప్రాంతాల్లో కూడా వ్యవసాయం లాభసాటిగా లేదని గుర్తించి, ఆ రంగం మీద ఆధారపడినవారిని తగ్గించకుండా యథాతథంగా కొనసాగించాలన్న విజన్‌పైనా తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన చేయాలి. అసంబద్ధమైన ప్రాజెక్టుల మీద వెచ్చిస్తున్న డబ్బును తెలంగాణలోని పల్లెల మధ్యన చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటానికి కేటాయించాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలి. ఇబ్బడిముబ్బడి ఉపాధికి ప్రోత్సాహం లభించేలా కార్మిక సంస్కరణల్ని అమలు చేయాలి. వ్యవసాయాన్ని, రైతుల్ని నష్టాల్లో కొనసాగిస్తూ, చుట్టూ వున్న వ్యవసాయాధారిత వృత్తులకు పరిశ్రమ హోదా ఇస్తే యువతకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. అది కూడా కులంతో ముడిపెట్టి చేయటం చాలా అనర్థదాయకం అవుతుంది. ముస్లిం సమాజంలో 20శాతం జనాభాగా ఉన్న మెహతా, దూదేకుల, పింజారి, నూర్‌బాషా,



లదాఫ్ అనే ఐదు కులాలకు ఇప్పటికే రిజర్వేషన్లు అమలవుతున్నా, ఇప్పటికైనా సమస్యను శాశ్వతంగా పరిష్కరించే ప్రయత్నం చేయకుండా మతం జత చేసి ముస్లిం రిజర్వేషన్ల పేరుతో మభ్యపెట్టే ధోరణుల్ని కేసీఆర్ ప్రభుత్వం వీడాలి.

కులంతో సంబంధం లేకుండా వృత్తులకు ప్రోత్సాహం, అందరికీ నాణ్యమైన విద్యతో కులవృత్తితో సంబంధం లేకుండా నచ్చిన రంగాన్ని ఎంచుకునే అవకాశం, వలసలు పోవాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయటం, కార్మిక సంస్కరణలు, 'ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను పెంచుకో లేదా కొత్తవారికి అవకాశం ఇవ్వు' అనే రీతిలో ప్రక్షాళన చేసి ప్రభుత్వోద్యోగ వ్యవస్థ పట్ల మోజు తగ్గించటం, నిరాడంబరతను, చిన్న పని పెద్ద పని అనుకోకుండా పనిని గౌరవించే సంస్కృతిని పెంచటం – కులాన్ని, వృత్తిని వేరు చేసి ఈ చర్యలు తీసుకోలేకపోవటం రాజకీయ అసమర్థత, దివాళాకోరుతనం తప్ప సమర్థత, దార్శనికత అనిపించుకోదు. అత్తెసరు ఉపాధికి కులం రంగు పూయటం సహించరానిది.

శతాబ్దాల పర్యంతం కులవివక్షకు గురైనవారికి కొంత ఉపశమనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు అవసరమే. రిజర్వేషన్లు కావచ్చు, మరోటి కావచ్చు. ఇక్కడ కులం ప్రస్తావన కూడా తప్పులేదు. కానీ ఆ ఏర్పాట్ల ద్వారా ఒక స్థాయి లబ్ధి పొందినవారికి వాటిని మినహాయించటం, వివక్షకు గురైనవారు 'పరిమిత ప్రయోజనాల' ఉపశమనాల కోసం తరాల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా వేగంగా, శాశ్వతంగా విముక్తి పొందేలా నాణ్యమైన విద్య, ఉపాధి వంటి ఏర్పాట్లను అందుబాటులోకి తేవటం వంటి చర్యలు చేపట్టాలి. షెడ్యూల్డ్ కులాల జాబితా రూపకల్పన వెనక డా॥ అంబేద్కర్ హేతుబద్ధ ఆలోచన ఇదే. అలాగే అణగారిన కులాలవారికి రాజకీయ ప్రాతినిధ్యం కోసం వంశపారంపర్య రాజకీయాలు లేకుండా పార్టీల్ని ప్రజాస్వామీకరించాలి. రాష్ట్ర విభజనలో కీలకపాత్ర పోషించిన కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మాటల్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

తెలుగునాట సామాజిక రాజకీయం జరిగి కింది కులాలకు అధికారం దక్కుతుందనే ఉద్దేశంతోనే తెలంగాణ విభజన చేశామని జైరాం రమేష్ చెప్పుకొచ్చారు. కానీ ఆ కులాలకు సరైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, అవకాశాలు లేకుండా, పార్టీల్లో ఏ స్థాయికైనా వేగంగా ఎదిగే అవకాశం సామాన్యులకు లేకుండా, ఊరికే కులాల పక్షాన ఉపన్యాసాలు ఇవ్వటం వల్ల చివరకు ఏం జరుగుతోంది?.. పార్టీల కుల సమీకరణాల్లో భాగంగా అణగారిన కులాల నుంచి నాయకులవుతున్నవారిలో అత్యధికులు అగ్రకులాల తరహాలో తయారవుతున్నారు తప్ప తమ కులాల్లోని కోట్లాదిమందికి తమలా అవకాశాలు అందించటానికి ప్రయత్నించటం లేదు.

నాణ్యమైన విద్య, ఉపాధి, పార్టీల ప్రజాస్వామీకరణ దిశగా వెళ్లాల్సిన పాలనను, రాజకీయాల్ని మళ్లీ వెనక్కి మళ్లించి కుల అస్తిత్వమే జీవనోపాధి అన్నట్టు చేయటం జాతి నిర్మాణానికి పెద్ద ద్రోహమవుతుందనటానికి బోలెడు సాక్ష్యాలున్నాయి. తెలంగాణలో అణగారిన కులాల కోసమే ఏర్పాటైన గురుకులాల్లో విద్యార్థులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసలందుకుంటున్న ఐపీఎస్ అధికారి డా॥ ప్రవీణ్ కుమార్ కూడా కులమనే భావనను విద్యార్థులలో నుంచి తొలగించి వారి అస్తిత్వాన్ని రీ ఇంజినీర్ చేయటమే తన లక్ష్యమని చెబుతున్నారు. రాజ్యాంగ లక్ష్యం దిశగా ఇలా అస్తిత్వాన్ని రీ ఇంజినీర్ చేసే రాజకీయం చేయకుండా, తాత్కాలిక ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తాము చేస్తున్న కుల రాజకీయాలు తెలుగువారికి లాభం చేకూర్చకపోగా తిరోగమనంలోకి నెట్టి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయనే కనీస సోయిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులిద్దరూ ప్రదర్శించాలి. విప్లవాత్మకంగా కాకపోయినా, ప్రధాని నరేంద్ర మోదీ తరహాలోనైనా మెరుగైన రాజకీయం కోసం కొంత ధైర్యాన్ని ప్రదర్శించాలి.

లోక్‌సత్తా ఉద్యమాన్ని పార్టీగా కూడా మార్చాలని భావిస్తున్న తరుణంలో వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌కి కొందరు అనుభవజ్ఞులైన శ్రేయోభిలాషులు ఓ సలహా ఇచ్చారు. ఆర్థిక విధానాల్ని ప్రకటించకుండా సమాజంలో ఓట్ల శాతం ఎక్కువగా ఉన్న కొన్ని వర్గాల సమస్యల మీద పోరాడుతూ ఉధృతమయ్యాక పార్టీ పెట్టమని జేపీకి సూచించారు. లోక్‌సత్తా ఉదార, పరిణతి ఆర్థిక విధానాలు, పన్నుల డబ్బుకు తగ్గ సేవలు, వార్డు ప్రభుత్వం వంటి ఆలోచనలు, అందరి ప్రయోజనాలనూ

సమన్వయం చేయాలనే నాగరిక ప్రజాస్వామిక రాజకీయ సంస్కృతి ఓట్లు వేసే వారిలో అత్యధికులకు నచ్చకపోవచ్చని, కాబట్టి ఆర్థికాంశాల మీద గ్యాస్ కొడుతూ, పరిష్కారాలు చూపకుండా సమస్యల మీదే రెచ్చగొడుతూ వారి ఓట్లు నొల్లుకునే వ్యూహం అవసరమని అన్నారు (లోక్‌సత్తా బాటలో కొన్నేళ్ల తర్వాత రాజకీయ పార్టీగా వచ్చిన ఆమ్ ఆద్మీ (ఆప్) ఇదే పనిచేసి ఎన్నికల విజయం సాధించింది. సరైన భావజాలం లేకపోవటమే ఆప్ తక్షణ విజయానికి కారణమన్న వాదనను తోసిపుచ్చలేం). కానీ వారి వాదనతో జేపీ ఏకీభవించలేదు. 'రాజకీయాలంటేనే విధానాల సంఘర్షణ. మోసం లేకుండా, ప్రతీ అంశంపై స్పష్టమైన విధానాలను ప్రకటించాకే పార్టీగా వెళ్దాం. మన విధానాలు కరెక్టా, కాదా? వాటిని వీలైనంత ప్రజల్లోకి తీసుకెళ్తూ సాధించేందుకు వేదికను నిర్మించి ఒక మార్గం చూపామా, లేదా? అన్న వరకే మన పాత్ర. ఓట్లు వేయటం, వేయకపోవటం ప్రజల ఇష్టం. అట్టడుగు వర్గాలకు నిజంగా ఎదిగే అవకాశాలనిచ్చే నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, స్థానిక సాధికారత, న్యాయ సంస్కరణలు, అవినీతిరహిత పాలన వంటి ఎజెండా లోక్‌సత్తా వద్దే ఉంది. వారికి అవగాహన లేక ఓట్లు వేయకపోయినా.. కనీసం లోక్‌సత్తా ఎజెండా తమకూ, దేశానికి కూడా ఎంతో అవసరం కాబట్టి కాస్త చదువు, వనరులు ఉన్న 10శాతం మంది ఓట్లు వేసినా తొలుత మనకు చాలు. వారి బలాన్ని ఉపయోగించి మిగిలినపార్టీలను వంచగలం. ఆ తర్వాత క్రమంగా అణగారినవర్గాలు కూడా వాస్తవాల్ని గుర్తించి లోక్‌సత్తా వైపే వస్తారు. ఇలా కాకుండా, అబద్ధాలతో, అర్ధసత్యాలతో మనం గెలిచినా, దాని వల్ల సాంప్రదాయ పార్టీల తరహా ఫలితాలే ఎక్కువగా వస్తాయి. ప్రజలకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. కాలం వృధా అవుతుంది. మనకు పార్టీ గెలుపు ఒక మార్గమే తప్ప లక్ష్యం కాదు. లక్ష్యం – జనం జీవితంలో మార్పు! అందుకు అడ్డగోలుగా గెలిచి ప్రజలకు పెద్దగా మేలు చేయలేని పార్టీగా కన్నా.. కొన్ని ఇబ్బందులతోనైనా ఎక్కువ మేలు చేసే తరహా పార్టీగా వెళ్లటమే మేలు. కాబట్టి కష్టమైనా, ఫలితాలు నెమ్మదిగా వచ్చినా.. ప్రజల పన్నుల డబ్బుకు, వారికి అందుతున్న సేవలకు మధ్య సంబంధం అర్థమయ్యేలా చేస్తూ స్పష్టమైన విధానాలతోనే వెళ్దాం. తక్షణ రాజకీయ ప్రయోజనాలూ – దీర్ఘకాలిక అవసరాలూ కలగలిసిన పొలిటికల్ పాత్‌లోనే పార్టీని ఏర్పాటు చేద్దాం' అని జేపీ అభిప్రాయపడ్డారు. కొంత తర్జనభర్జన తర్వాత జేపీ అభిప్రాయంతో అత్యధికులు ఏకీభవించారు. 2006 అక్టోబర్ 2న లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది. ఈ దీర్ఘకాలిక ధోరణితోనే చేనేత కార్మికుల సంక్షోభానికి కూడా తక్షణ రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా శాశ్వత పరిష్కారాన్ని లోక్‌సత్తా సూచించింది.



వ్యవసాయం తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువమందికి జీవనాధారంగా చేనేతరంగానికి ప్రాధాన్యత ఉంది. కానీ వ్యవసాయరంగాన్ని రైతులకు ఆదాయం చుట్టూ తిప్పేలా మార్పుల్ని తేకుండా రుణమాఫీలు, తాయిలాలతో వారిని ఓటు బ్యాంకులుగా వినియోగించుకున్నట్టే, చేనేతకారుల జీవితాల్ని బాగుచేసే మార్పుల్ని తీసుకురాకుండా తాత్కాలిక పరిష్కారాల చుట్టూ తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో జేపీ బృందం తెలంగాణ సిరిసిల్లలోని చేనేత కార్మికుల పరిస్థితిని అధ్యయనం చేసింది. ఈ బృందంలో దివంగత చెన్నమనేని రాజేశ్వరరావు వంటి పెద్దలు ఉన్నారు. చేనేతకారులకు తాత్కాలిక సాయాన్ని అందిస్తూనే ప్రోత్సాహకాల్ని మార్చటం, అభివృద్ధిని హైదరాబాద్ నుంచి వికేంద్రీకరించటం, చేనేత ఉత్పత్తులను వీలున్నంత మేర మార్కెట్‌తో సంధానం చేయటం, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నచ్చిన ఉపాధిని ఎంచుకునే అవకాశం ప్రతి చేనేతకారునికీ కల్పించటం తప్ప మరేవీ చేనేత సంక్షోభాన్ని పరిష్కరించలేమని లోక్‌సత్తా స్పష్టంగా పేర్కొంది. చేనేత ఉత్పత్తులకు లాభదాయక మార్కెట్ అవకాశాలు పరిమితంగా ఉన్నాయికాబట్టి.. శాశ్వత పరిష్కార విధానాలను వేగంగా అమలు చేయాలని కోరింది. ప్రభుత్వం తాత్కాలికంగా ఇచ్చే సాయాన్ని తీసుకుంటూనే, విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, స్థానిక స్వయంపాలన మీదే దృష్టి పెట్టండని, ఓట్లు కూడా వాటి చుట్టూనే వేయండని నేతకారులకు, నేతలకు జేపీ సూచించారు. బృందంలోని మిగిలినవారు కూడా ఈ సూచనలతో ఏకీభవించారు. కానీ ఇప్పటికీ ఆ రాజకీయ పరిష్కారం చేనేత జీవితాలలో కలబోతగా మారకపోవటంతో, సంక్షోభం మళ్లీ మొదటికొచ్చినట్టు కొనసాగుతోంది.

ప్రజారాజ్యం అధ్యక్షుడిగా చిరంజీవి కూడా సిరిసిల్ల సందర్శించి వచ్చారు. ఆరోజున ఆయన, ఇప్పుడు రెండు రాష్ట్రాలయ్యాకా సాంప్రదాయ నేతలు, పాలకులు చేనేత సంక్షోభం చుట్టూ తాత్కాలిక పరిష్కారాల ఓటు బ్యాంకు రాజకీయాన్నే కొనసాగిస్తున్నారు.

ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఉపాధి సృష్టిస్తామన్న హామీ అమలులో ఘోరంగా విఫలమవటంతో మళ్లీ ఎన్నికలలో



# జైరాం రమేష్ లెక్క తప్పింది ఈ ఏర్పాట్లు లేకే!

రాష్ట్ర విభజనలో కీలకపాత్ర పోషించిన కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మాటల్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

తెలుగునాట సామాజిక రాజకీయం జరిగి కింది కులాలకు అధికారం దక్కుతుందనే ఉద్దేశంతోనే తెలంగాణ విభజన చేశామని జైరాం రమేష్ చెప్పుకొచ్చారు. కానీ రాజకీయం మారకుండా రాష్ట్రాలు ఏర్పాటైనా అలాంటి మార్పులు రావని మరోమారు రుజువైంది. అణగారిన కులాలకు సరైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, అవకాశాలు లేకుండా, సామాన్యులు ఏ స్థాయికైనా వేగంగా ఎదిగే అంతర్గత ప్రజాస్వామ్యం పార్టీల్లో లేకుండా, ఊరికే కులాల పక్షాన ఉపన్యాసాలు ఇవ్వటం వల్ల చివరకు ఏం జరుగుతోంది?.. పార్టీల కుల సమీకరణాల్లో భాగంగా అణగారిన కులాల నుంచి నాయకులవుతున్నవారిలో అత్యధికులు అగ్రకులాల తరహాలో తయారవుతున్నారు తప్ప తమ కులాల్లోని కోట్లాదిమందికి తమలా అవకాశాలు అందించటానికి ప్రయత్నించటం లేదు. ఇలాంటి రాజకీయం, నాయకత్వంతో అణగారిన వర్గాల ప్రాతినిధ్యం ఎలా సాధ్యమవుతుంది? 2009 ఎన్నికల్లో లోక్‌సత్తా పనిగట్టుకుని ఏ కులానికీ టికెట్ల కేటాయింపులు చేయలేదు. అయినా ప్రతి ముగ్గురు అభ్యర్థుల్లో ఒకరు బీసీకి టికెట్ లభించింది. ఇది కేవలం వంశపారంపర్య రాజకీయాలు లేకుండా ప్రజాస్వామిక రాజకీయ సంస్కృతితో వ్యవహరించటం వల్లే సాధ్యమైంది. ఇలాంటి కొత్త రాజకీయం, నల్లడబ్బుతో ప్రమేయం లేని ఎన్నికల వ్యవస్థ వస్తే.. కులం, మతం, కుటుంబ, ఆర్థిక నేపథ్యంతో సంబంధం లేకుండా అందరికీ అవకాశాలు లభిస్తాయి. సాంకేతికంగా చూసుకున్నా ప్రతి కులం, మతం, వర్గం వారికీ సముచిత ప్రాతినిధ్యం కనిపిస్తుంటుంది.

గెలవటానికి ఇప్పుడు చేనేత, ఇతర చేతివృత్తుల వారికి ఉపాధి చుట్టూ కులరాజకీయాలు చేయటానికి పాలకపక్షాలు సిద్ధమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం ముసుగేసుకుని ఈ ధోరణిని ఒక క్రమపద్ధతిలో పెంచుతుండగా, తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ బాహాటంగా, దూకుడుగా కుల ఉపాధి ప్రతిపాదనల్ని తెర మీదకు తెచ్చారు.

### తెలంగాణలో సగానికిపైగా బీసీలు

తెలంగాణ జనాభాలో సగానికి పైగా చేతివృత్తుల వారే ఉన్నారని సామాజిక ఆర్థిక సర్వే పత్రం వెల్లడిస్తోంది. వీరిలో గణనీయంగా ఎస్సీలుండగా, అత్యధికులు వెనకబడిన తరగతుల (బీసీ) జాబితాలో ఉన్నారు. తెలంగాణలో బీసీ జనాభా 52శాతం ఉందని ఆగస్టు 2014లో జరిపిన సమగ్ర కుటుంబ సర్వేలో తేలింది. ఈ సర్వే ప్రకారం తెలంగాణలో 45.11లక్షల బీసీ కుటుంబాలున్నాయి. వీరి జనాభా 1.57 కోట్లు. వీరిలో వృత్తుల్లో ఉన్న కుటుంబాలు 35.6లక్షలుకాగా, ఈ జనాభా 1.24కోట్లు. వృత్తులు కోల్పోయినవారు సుమారు 7లక్షలమంది ఉండగా, సంచార కులాలవారు లక్షా 50వేలమంది వరకూ ఉన్నారు. తెలంగాణలో 35.50 లక్షల బీసీ కుటుంబాలు ఇంకా వృత్తి పైనే ఆధారపడి జీవిస్తున్నాయని వెనకబడిన తరగతుల కులాలపై నియమించిన ప్రభుత్వ అధ్యయన కమిటీ తాజాగా వెల్లడించింది. తెలంగాణలో 50శాతానికిపైగా ఉన్న బీసీ కులాలు, వృత్తుల వారి ఆర్థికాభివృద్ధికి కార్యాచరణ రూపొందించేందుకు ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, స్పీకర్ మధుసూదనాచారితో ఏర్పాటైన కమిటీ ఇది. సమగ్ర కుటుంబ సర్వే, బీసీ కులాల ప్రతినిధుల అభిప్రాయాలు ఆధారంగా కమిటీ తన నివేదికను రూపొందించింది. బీసీలకు నైపుణ్యాలను పెంచి స్వయంఉపాధికి అవకాశాల్ని అందిస్తే, ఆదాయం లభిస్తుందని కమిటీ సూచించింది.

### బీసీలు - బీసీ కులాలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా తెలుగుదేశం హయాంలో బీసీల కోసం 'ఆదరణ' వంటి పథకాలు అమలయ్యాయి. వీరి ఓట్లు ఉండబట్టే తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉండేది. పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకురావటం, కొత్త నేతలకు రాజకీయాలలో అవకాశాలు కల్పించటం వంటి కారణాలతో బీసీలు తెదేపాకు గట్టి అండగా ఉండేవారు. అయితే ఆదరణ పథకం అమలులో తెలుగుదేశం ప్రభుత్వం లోపల ఏరకంగా వ్యవహరించినా.. విధానపరంగా బీసీ కులాల పేరుతో కాకుండా, బీసీలకు తోడ్పాటు పేరుతో ఈ స్కీమును అమలుచేసింది. రాష్ట్ర విభజనానంతర పరిణామాలతో ఇక ఇక్కడ తెలుగుదేశం పార్టీకి అవకాశాలు లేవని అధికార తెలంగాణ రాష్ట్ర సమితి ధృవీకరించుకుంది. బీసీలను ఒకే కేటగిరీగా ఆకట్టుకోవటానికి పెద్ద ప్రయత్నం అవసరం కాబట్టి, కులాలుగా విడగొట్టి లబ్ధి పొందే అడ్డదారిని అనుసరిస్తోంది.

### ఉద్యోగాలపై యువతలో పెరుగుతున్న అనుమానాలు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రధానకారణాల్లో ఒకటైన ఉద్యోగాల కల్పనలో విఫలమవటం కేసీఆర్ ప్రభుత్వానికి

పెద్ద సమస్యగా తయారైంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ముందుండి త్యాగాలు చేసినవారిలో అత్యధికులు కూడా చేతివృత్తుల (బీసీ, ఎస్సీ) వారే. రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలు లక్షా 7వేలు, తాగునీటి సరఫరా మిషన్ వగైరాలలో ఉద్యోగావకాశాలు కలిపి కనీసం లక్షా 50వేల వరకు ఉద్యోగావకాశాలు ఉన్నాయని భావిస్తున్నా.. ఇప్పటివరకూ నియామకాలు, భర్తీకి ప్రభుత్వం ఆమోదించిన ఖాళీలు నలభైవేలు (కానిస్టేబుళ్లు, సింగరేణిలో నియామకాలు కలిపి ఉదారంగా అనుకున్నా) దాటలేదు. రెండేళ్లలో భర్తీ చేస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన లక్ష పైచిలుకు ఉద్యోగాలను ఎన్నికల సమయానికైనా పూరిస్తారని అధికార పార్టీ వర్గాలు అంటున్నా వాస్తవ పరిస్థితి అంత సానుకూలంగా లేదు. అందుకే అనుమానాలు పెరుగుతున్నాయి.

ఏటా రూ.10,000కోట్ల మేర తెలంగాణ ఆదాయం పెరుగుతోందన్న మాటల్ని నమ్మినా, లక్ష పైచిలుకు ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేయటం పెనుభారమయ్యేలా కనిపిస్తోంది. పెద్ద ఆర్థిక పరుగులేకపోవటంతోపాటు, ఆటోమేషన్ పెరుగుతుండటం, తాత్కాలిక అవసరాల కోసం బాధ్యతారహితంగా ప్రభుత్వోద్యోగుల జీతభత్యాల్ని పెంచేయటం ఇందుకు కారణం. పోలీసు శాఖలోనే కాస్త నియామకాల స్పీడు కనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ సయమంలో అసంబద్ధ ఆశల్ని కల్పించటంతోపాటు ప్రభుత్వోద్యోగంలో చేరితే పని చేసినా చేయకపోయినా లైఫ్ సెటిలైపోయినట్టే అనే భావనని పెంచిపోషించారు. దీంతో ఈ ఉద్యోగాల కోసం తెలంగాణలో దాదాపు 14లక్షల మంది యువతీయువకులు ఆశపడుతున్నారు. వీరుగాకుండా, ఏదోక ఉద్యోగానికి అర్హత చదువులున్నవారు మరో 40లక్షలమంది యువత ఉన్నారు. వీరంతా ఏదోక ప్రభుత్వోద్యోగం లేదా బాగా ఆదాయమున్న ఉపాధి కోసమే ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు వీరందరికీ ఉద్యోగాలు కల్పించకపోతే, తెలంగాణ ఉద్యమ సమయంలో, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్ని నెరవేర్చలేని వైఫల్యంతో ఎన్నికలలో ఘోర భంగపాటు తప్పదు. ఎన్నికల దాకా నియామకాల్ని సాగలాగి యువతకు ఇంకా ఆశలు ఉండగానే ఎన్నికలకు వెళ్లి ఇంకోసారి గెలవాలన్న వ్యూహానికి ఉద్యమసహచరుల నుంచి, ప్రతిపక్షాల నుంచి సమస్యలు పెరిగిపోతున్నాయి. రెండోసారి గెలిచాక అప్పుడు చూసుకోవచ్చు అనుకున్న ప్రభుత్వాన్ని నిరుద్యోగ భూతం భయపెడుతోంది. ప్రభుత్వంపై ఉద్యోగాలు, ఉపాధి విషయంలో తలెత్తుతున్న అనుమానాలను తెరాస వ్యతిరేక శక్తులు రెచ్చగొట్టగలుగుతున్నాయి. తెలంగాణ జేఏసీ సారథిగా కోదండరాం ఇచ్చిన ఆందోళన పిలుపుకి నిరుద్యోగులు పెద్దఎత్తున



తరలిరాకపోయినా, వారి మనసుల్లో అనుమానాలు బలంగా ఉండటం వల్ల మౌనం అర్థంగీకారం అన్నట్టు వ్యవహరించారు. నిరుద్యోగ ర్యాలీకి వారి పరోక్ష మద్దతు ఉండబట్టే ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఆందోళనను అడ్డుకుంది. తెలంగాణ వచ్చిన మూడేళ్లలోపే.. తెలంగాణ ఉద్యమం నుంచి వచ్చిన ప్రభుత్వం, ఉద్యమంలో పాల్గొన్నవారు తలపడటం, పోలీసుల మోహరింపు పలువురిని బాధించినా రాజకీయ క్రీడలో నిస్సహాయులుగా చూస్తుండిపోయారు.

**ఎలాంటి తెలంగాణ కావాలో చర్చను వినిపించకుండా చేయటం వల్ల..**

ఎలాంటి తెలంగాణ కావాలి?, తెలంగాణ ఏర్పాటు మార్గమా? లక్ష్యమా? అనే లోతైన చర్చను రాష్ట్ర ఉద్యమ సమయంలో లేవనెత్తిన గళాల్ని వినిపించకుండా చేయటం ఈ సంక్షోభానికి ప్రధాన మూలమని ఇప్పుడిప్పుడే కొందరు అంగీకరిస్తున్నారు.

ఈ నేపథ్యంలో, ప్రతిపక్షాల మధ్య అనైక్యత చిచ్చుపెట్టగలిగినా, తాగు, సాగునీరు విషయంలో పురోగతి సాధించినా.. యువతకు ఉపాధి లేకపోతే గెలుపు కష్టమేనని అర్థమవటంతో కొత్త చిట్కా కేసీఆర్ ప్రభుత్వానికి అవసరమైంది. ఫలితమే కులహితం పేరుతో కులాల చుట్టూ ఉపాధిని అల్లే ప్రయత్నం.

## కులం ఐడెంటిటీతో వస్తే, ఏదోకరకంగా ఉపాధి

బీసీల కోసం ప్రస్తుతం 11 ఫెడరేషన్లు/సొసైటీలు ఉన్నా ఆశించిన ఫలితం దక్కలేదని తెలంగాణ ప్రభుత్వం అంటోంది. కులాల ప్రాతిపదికన ఉపాధి కల్పించేందుకు ఫెడరేషన్‌లను రద్దు చేసి బీసీ కార్పొరేషన్‌లో కలిపింది. కులాల పరంగా కేటాయింపులు జరిపేందుకు కులాలవారీగా ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించారు, కొనసాగిస్తున్నారు. ముస్లింలు, ముదిరాజ్, బేస్తవారు, గంగపుత్రులు, బోయలు, కురుమ, యాదవులు తదితర కులాలతో సమావేశాలు ఏర్పాటు చేశారు.

# ప్రతిపక్షాలూ వేస్తున్నాయి కుల పాచికలు

తెలంగాణలో కుల రాజకీయాలకు ప్రతిపక్షాలూ పెద్దఎత్తున ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు రెండూ తెరాసకు వ్యతిరేకంగా ఒక ఆధిపత్య కులం ఆధ్వర్యంలో సమీకరణలు జరుపుతున్నాయని అంచనా. వ్యూహాత్మకంగా మరో కొత్త పార్టీని కూడా వీరు ప్రోత్సహిస్తున్నారని వినికిడి. కేసీఆర్ 'బీసీ కులాలు – వృత్తుల' ఎత్తుగడకు ప్రతిపక్షాల సమీకరణలు కూడా ప్రధాన కారణమంటున్నారు. విపక్షాలను కులాలకతీతమైన రాజకీయ ఎజెండాతో ఎదుర్కొనే సామర్థ్యంలేకే.. వాటి ఓటుబ్యాంకును చీల్చేందుకు బీసీ కులాల కార్డుతో తెరాసను దిగువస్థాయికి విస్తరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ కుల ఫార్ములా ప్రభావం అనుకున్నట్టుగా వర్కవుటయితే, ముందస్తు ఎన్నికలకు కేసీఆర్ వెళ్తారని అంచనా. తెలంగాణలో ప్రతిపక్షం ఇంకా బలహీనంగా ఉండటంతో విపక్షాల కుల రాజకీయాలు చాప కింద నీరులాగానే సాగుతున్నాయిగానీ, కులతత్వం అడుగడుగునా కనిపించే ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షం కూడా బలంగా ఉండటంతో ఇప్పటికే జోరందుకున్నాయి. ఉపాధిని ప్రతిపక్షం ఇవ్వలేదు కాబట్టి.. నిరుద్యోగ భృతి, కాపు రిజర్వేషన్ వంటి అంశాల మీద దుందుడుకు డిమాండ్లు చేస్తూ కొన్ని కులాలను ఆకట్టుకునేందుకు వైకాపా ప్రయత్నాలు చేస్తోంది. కానీ అంతకంటే ఎక్కువగా.. 2019 ఎన్నికలకు కులాలవారీ రాజకీయ సమీకరణలను చేస్తోంది. తనను, తన తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని చూసి మాత్రమే ఓట్లు వేస్తారన్న భ్రమ నుంచి బైటికొస్తున్న వైకాపా నేత జగన్ తనపై ఉన్న క్రైస్తవ ముద్రను చెరిపేసుకునేందుకు హిందూ ఆలయాలు, పీఠాలకు వెళ్లి స్వాముల ఆశీస్సులు తీసుకుంటున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పనితీరు పేలవంగా ఉండటంతో ప్రజల్లో తనసభలకు స్పందన పెరగటం, స్థానిక నేతలు అధికార తెదేపాకు రాజీనామా చేసి వైకాపాలో చేరుతుండటం, తనకు వ్యతిరేకంగా ఉండే మీడియా కూడా కవరేజీని పెంచటంతో కుల సమీకరణల్లో జగన్ వేగం పెంచారు. జిల్లాలవారీగా నియోజకవర్గాలస్థాయిలో ఇతర పార్టీల నేతల్ని గుర్తించి పార్టీలో చేర్చుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. తెదేపాలో తమకు ఇక అవకాశం రాదనుకుంటున్న నేతల్ని గుర్తించి లాగేందుకు బృందాల్ని ఏర్పాటు చేశారు. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి, ఆ తర్వాత తెలుగుదేశం నుంచి ఎక్కువగా వైకాపాలోకి రావొచ్చన్న అంచనాలతో పావులు కదుపుతున్నారు. ఆ పార్టీల్లోని సీనియర్ నాయకులు జగన్ వద్ద పనిచేయటాన్ని ఇబ్బందికరంగా భావిస్తున్నా, తమ వారసులను చేర్చటానికి సంకోచించటం లేదు. ఆ రకంగానే ఇటీవల నరసరావుపేటలో కాసు కృష్ణారెడ్డి కుమారుడు కాసు మహేష్ రెడ్డి వైకాపాలో చేరారు. పల్నాడు ప్రాంతంలో రెడ్డి సామాజిక వర్గం ఓట్లను ఈయన ప్రభావితం చేయగలరని అంచనా. కాసు మహేష్ చేరిక సందర్భంలో జరిపిన నరసరావుపేట సభకు కమ్మ సామాజికవర్గం వారు



కూడా సహకరించటం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇదేరకంగా విజయవాడలో వైశ్య వర్గానికి చెందిన వెల్లంపల్లి శ్రీనివాస్ (మాజీ ఎమ్మెల్యే)ని చేర్చుకోవటం, తూర్పు గోదావరిలో కందుల దుర్గేష్‌ను చేర్చుకోవటం జరిగింది. ప్రకాశం జిల్లా అద్దంకిలో మాజీ ఎమ్మెల్యే బాచిన గరటయ్యను చేర్చుకోవటం ద్వారా కమ్మ సామాజిక వర్గానికి జగన్ సానుకూల సంకేతం ఇచ్చారు. ఐదారు నియోజకవర్గాలలో గరటయ్య ప్రభావం చూపగలరని అంచనా. తెదేపా నేతలు గొట్టిపాటి రవి–కరణం బలరాం మధ్య పోరు తనకు లాభిస్తుందని జగన్ ఆశపడుతున్నారు. ఇక విజయవాడ ఎంపీ స్థానం కాపులకు, బందరు స్థానం బీసీలకు ఇవ్వటం, జిల్లా అధ్యక్ష పదవిలో ఇప్పటికే యాదవ వర్గానికి చెందిన మాజీ మంత్రి పార్థసారథిని కొనసాగించటం వంటి ఫార్ములాలు అమలుచేస్తున్నారు. కొత్తవారి వల్ల అభద్రతకు గురికావద్దని, అందరికీ పదవులు ఇస్తానని బహిరంగ వేదికల మీదే ప్రకటిస్తూ భరోసా ఇస్తున్నారు. మరోవైపు, సోషల్ మీడియాలో కులం చుట్టూ పంచ్, ఉపాధితో యువతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఇంత చేసినా తనకు కాస్త చదువుకున్న ప్రజలు, ముఖ్యంగా యువత, మహిళలలో పట్టు లభిస్తుండకపోవటంతో, చంద్రబాబు బలహీనత అయిన పౌరసమాజం మార్గంలో కూడా రాజకీయ పోరాటానికి జగన్ ప్రయత్నాలు చేస్తున్నారు. కులతత్వాన్ని వ్యతిరేకించే జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్‌కు అనివార్యంగా పడే కుల ఓట్లను బ్యాలెన్స్ చేసే శక్తుల్ని కూడా తయారుచేసుకునే పనిలో ఉన్నారు.

కలెక్టర్ల సమావేశంలో యాదవులతో మేకలు, గొర్రెల పెంపకాన్ని పెద్దఎత్తున చేపట్టాలని సూచించారు. ఇంటికో బర్రె, 75శాతం సబ్సిడీతో 4లక్షలమంది మందకో గొర్రె (ఈ పథకానికి రెండేళ్లలో రూ. 5,000కోట్లు వరకూ అవ్వొచ్చని అంచనా) వంటి పథకాలను ప్రకటించారు. యాదవ ఉపకులాలైన ఎర్రగొల్ల, పూజగొల్ల, ముష్టిగొల్ల, పాకనాటిగొల్ల, గండిరెడ్డిగొల్ల, కురుమగొల్ల,

పూసగొల్లల సమస్యలను విడివిడిగా గుర్తించాలని నిర్ణయించారు. అలాగే గ్రామం నుంచే కులాలవారీగా బడ్జెట్‌లో భాగమయ్యే ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై చర్చలు, ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షం వంటివి సమాంతరంగా కొనసాగించారు. గొర్రెల పెంపకం వంటి వృత్తుల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు వారి కోసం కేటాయించిన ప్రత్యేక పథకం నుంచి నిధులిస్తారు. ప్రత్యేక మానవ వనరులంటే కంపెనీలు, శిక్షణ కాదు, తెలంగాణలో వృత్తులే నిజమైన వనరులు అని ముఖ్యమంత్రి ఒకడుగు ముందుకేసి మరీ వ్యాఖ్యానించారు.

## ఎంబీసీలకూ ప్రత్యేక కార్పొరేషన్

తెలుగు రాష్ట్రాల్లో బీసీల్లో 120 కులాల వరకూ ఉన్నట్టు అంచనా. వీరిలో దాదాపు 100కుపైగా కులాలు అత్యంత వెనకబడినవే. మొత్తం బీసీ జనాభాలో 38శాతం వరకూ ఎంబీసీలు (అత్యంత వెనకబడిన కులాలు) ఉన్నట్టు అంచనా. దీంతో, ఎంబీసీలతో ప్రత్యేక సమావేశాల్ని కేసీఆర్ ఏర్పాటు చేశారు. తెలంగాణలోని ఎంబీసీల కోసం రూ. వెయ్యికోట్ల పైచిలుకు నిధుల హామీతో ప్రత్యేక కార్పొరేషన్‌నూ ప్రకటించారు. దేశవ్యాప్తంగా గత పదిపదిహేనేళ్లలో చేనేతల్లో 22లక్షలమంది కూలీలుగా మారిపోగా, తెలంగాణలోనే 600మందికిపైగా చేనేతకారులు, 119మంది స్వర్ణకారులు, ఇతర వృత్తులవారు 114మంది ఆత్మహత్యలకు పాల్పడినట్టు అధికారిక అంచనా. పలువురు సూరత్, షోలాపూర్, పూనే వంటి ప్రాంతాలకు వలసలు పోయారు. బీసీల్లో మనుగడలో వున్న వృత్తులకు నవీకరణ, శిక్షణ, మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తామంటూనే, కులవృత్తి నశించి ఆర్థికంగా చితికిపోయిన కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని కేసీఆర్ తెలిపారు. వృత్తులే లేని కులాలకు ఆయా ప్రాంతాలలో అవసరాలను ప్రాతిపదికగా తీసుకుని ఉపాధి కల్పిస్తామన్నారు. వీటితోపాటు ఇంకో మాట కూడా చెప్పారు. గురుకులాల్లో పిల్లలను చేర్చి మంచి చదువుల్ని చదివించాలని సూచించారు. అయితే.. ఏం చేసినా కులమే ప్రాతిపదిక, ఇదే మీ ఐడెంటిటీ అని తేల్చిచెప్పారు.

గొర్రెల పెంపకం, చేపల వేట వంటి కొన్ని కులవృత్తులను పరిశ్రమలుగా కూడా గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు.

## పనిలోపనిగా అగ్రకులాల్లో అడిగినవారికీ

అలాగే బ్రాహ్మణులు, ఇతర కొన్ని అగ్రకులాలలో ఉన్న పేదల కోసం కూడా భవనాలు, పరిషత్తులు వంటి ఏర్పాట్లకు కేసీఆర్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. కదీనిపై ప్రతిపాదనల రూపకల్పన పనిని నమ్మకమైన సీనియర్ అధికారులను పురమాయించింది. ఇందులో ఆయా కులసంఘాల ప్రతినిధులకు పెద్దపీట వేస్తోంది. కానీ ప్రతిపాదన ఏదైనా.. కులం బరిలోనే తిరుగుతుండాలని గీత గీసింది. వైశ్యులకు కూడా ఇలాంటి ఏర్పాటు కావాలని ఏపీకి చెందిన నేత టీజీ వెంకటేష్ ఇటీవల కేసీఆర్‌ను కోరారు.

## పుట్టుకను బట్టి బిడ్డ భవిష్యత్తు నిర్ణయమవ్వాలనటం ఎంత అవమానకరం!

ప్రపంచవ్యాప్తంగా ఆర్థికమందగమనం, తెలంగాణ ప్రభుత్వం ఎంత ప్రయత్నించినా ఆశించిన స్థాయిలో పారిశ్రామిక ఉపాధి పెరగకపోవటం, పొంచివున్న ఆటోమేషన్, వ్యవసాయాధారిత గ్రామాలలో యథాతథస్థితిని కొనసాగించాలనే ప్రభుత్వ విజన్ వల్ల ఉపాధి కోసం కేసీఆర్ చేతివృత్తులను ప్రోత్సహించాలనుకోవటంలో తప్పు లేదు. కానీ ఎంత ప్రోత్సహించినా మార్కెట్ డిమాండ్‌లేని చోట దీర్ఘకాలంలో సాధించేదేమీ ఉండదు. ఒకతూరి ఎన్నికల్లో కొందరు తెరాస అభ్యర్థులో, పార్టీయో గెలవటం కోసం.. యాదృచ్ఛికంగా ఒక కులంలో పుట్టినవారిని అదే కులవృత్తిని కొనసాగించాలనటం ఎంత అమానుషం! మూడు వేల సంవత్సరాల క్రితం ఏర్పడిన కుల వ్యవస్థను వృత్తితోనో, మరో అంశంతోనో ముడిపెట్టి కొనసాగించాలనుకోవటం అనాగరిక పాలనే అవుతుంది. కేవలం పుట్టుకను బట్టి ఒక బిడ్డ భవిష్యత్తు నిర్ణయమైపోవటమంటే, ఇక ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి? కులవృత్తిలో భాగంగానే రాష్ట్రానికి పాలకుడినయ్యానని కేసీఆర్ వాదిస్తే ఎంత పరిహాసాస్పదంగా ఉంటుంది? ఒక తరంకాలంలో కులాన్ని నిర్మూలించాలని ప్రయత్నించాల్సిన యుగంలో, అందుకుతగ్గ యువజనం, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న కాలంలో.. ఇలాంటి కులవృత్తి రాజకీయం సంస్కరణలకు ఎంత అవరోధంగా మారుతుందో ఆలోచించారా?

కులం, మతం పేరుతో ఓట్లు దండుకుందామనే రాజకీయం వల్లే ముస్లిం సమాజంలో 20శాతం జనాభాగా ఉన్న మెహతా, దూదేకుల, పింజారి, నూర్‌బాషా, లదాఫ్ అనే ఐదు కులాలకు ఇప్పటికే రిజర్వేషన్లు అమలవుతున్నా, ఇప్పటికైనా సమస్యను శాశ్వతంగా పరిష్కరించే ప్రయత్నం చేయకుండా మళ్లీ ముస్లిం రిజర్వేషన్ల ద్వారా లబ్ధి పొందేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. ఇఫ్తార్ దావత్‌కి (క్రిస్మస్ విందుకి కూడా) బడ్జెట్ నిధుల్ని వందశాతం ఖర్చు చేశారుగానీ, ముస్లిం విద్యార్థుల ఫీజులకు మాత్రం రూపాయి కూడా ఖర్చు చేయటానికి ప్రభుత్వం ఆసక్తి చూపటం లేదు. 2016-17 ఆర్థికసంవత్సరంలో మెయింటినెన్స్ ఆఫ్ ట్యూషన్ ఫీజులు (ఎంటీఎఫ్) కింద చేసిన ఖర్చు అక్షరాలా 'సున్నా' అని సమాచార హక్కు దరఖాస్తు ద్వారా బైటపడింది. అలాగే ముస్లింలలోని వ్యాపార ఔత్సాహికులను

ప్రోత్సహించేందుకు ఇచ్చే రుణాలు 2015-16లో 38.4శాతం ఉండగా, 2016-17 ఆర్థిక సంవత్సరంలో 20శాతం లోపుకు తగ్గిపోయాయి. ఇదే సమయంలో ముస్లింలలో నైపుణ్యాల్ని పెంచేందుకు చేసే ఖర్చును 50శాతం నుంచి 2శాతానికి తగ్గించారు. ముస్లింల ఎదుగుదలకు దోహదం చేసేది ఇఫ్తార్ విందులా? చదువు, ఉపాధా?.. ఎంఐఎం నమూనాలో తెరాస ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు రాజకీయంకాక మరేమిటిది?

ప్రజాజీవితంలో ఉన్నప్పుడు తీసుకునే నిర్ణయాలు, పాలకులుగా తీసుకునే విధానాలు కులాన్ని ఘనీభవింప చేసేట్టు ఉంటే దాని దుష్ప్రభావం సమాజం మీద చాలా విస్తృతంగా ఉంటుంది. అందుకే రాజకీయ వ్యవస్థ కులం విషయంలో చాలా స్పృహతో, ముందుచూపుతో వ్యవహరించాలి. కానీ కులవృత్తుల్ని, కులాలవారీగా ఉపాధిని ప్రోత్సహించే కేసీఆర్‌లో ఆ ధోరణి కనిపించటం లేదు. ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణలో ప్రాచుర్య మీడియా కేసీఆర్‌కు అనుకూలంగా ఉందన్నది బహిరంగ రహస్యం. తెలంగాణ నిలదొక్కుకోవటానికి కొంత వేచిచూసే ధోరణి అవసరమే అయినా, తప్పుడు నిర్ణయాలకు, వ్యక్తిగత పటాటోపాలకు, మూఢవిశ్వాసాలకు కూడా తందాన అనే మీడియా వల్ల అంతిమంగా తెలంగాణ ప్రజలకు నష్టమే జరుగుతుందని గుర్తెరగాలి. ఏపీతో పోలిస్తే తెలంగాణలో కులం ప్రభావం కొంత తక్కువనే చెప్పాలి. కానీ ప్రస్తుత పాలన కులరాజకీయాల స్కేల్‌ని పెంచి పోషించే రీతిలో సాగుతోంది.

## ఆంధ్రప్రదేశ్‌లోనూ..

ఆంధ్రప్రదేశ్‌లోనూ పరిస్థితేమీ భిన్నంగా లేదు. తెలంగాణలోలా ఉపాధి కల్పనలో విఫలమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, 'కుల వృత్తులు' అనకపోయినా ఉపాధికి-కులానికి ముడిపెడుతున్నారు. కుల కార్పొరేషన్ల ద్వారా ఉపాధితోపాటు ఇతరత్రా సాయాలు కూడా అందించే ప్రయత్నం చేస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు కులాలపై అంతగా దృష్టి కేంద్రీకరించలేదు. కానీ రాష్ట్ర విభజన నేపథ్యంలో 2014 ఎన్నికల్లో ఆచరణ సాధ్యంకాని రీతిలో కాపు రిజర్వేషన్ల అంశాన్ని ఎత్తుకుని కులాల కుంపటితో లబ్ధి పొందే ప్రయత్నం చేశారు. ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పట్ల ఉన్న తీవ్ర విముఖత, అడ్డగోలు హామీలు, పవన్ కళ్యాణ్ తోడ్పాటు వంటి కారణాలతో ఎన్నికయ్యాక చంద్రబాబు మళ్లీ అదే కుల రాజకీయ ఒరవడిని కొనసాగిస్తున్నారు. నూతన ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పలు నిర్ణయాల్లో కుల కోణం కనిపిస్తోంది. కాపుల రిజర్వేషన్ హామీని కాస్త వివేకంతో, పెద్దరికంతో ఆలోచించి పరిష్కరించే ప్రయత్నం చేయకుండా ఓట్ల వేట చుట్టూ తిప్పుతున్నారు. అసలే ప్రతిదీ కులంతో ముడిపడి, కుల రాజకీయాలకు కేంద్రమైన ఆంధ్రప్రదేశ్‌లో.. వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు మరింత కులపిచ్చిని పెంచుతున్నారు. కులాలవారీ ఓటు బ్యాంకులను తయారుచేసుకుంటున్నారు. ఎన్నికల్లో విజయాన్ని ప్రభావితం చేసే కొన్ని కులాలపై ప్రత్యేకించి దృష్టి సారిస్తున్నారు. కులాలవారీగా నిధులు, కొత్తగా కార్పొరేషన్లు ఏర్పాటు చేయటం ద్వారా రానున్న ఎన్నికల్లో గెలవాలని ప్రణాళికలకు పదును పెడుతున్నారు.

## అన్ని కులాలకూ అంటించే ప్రయత్నం

ఏపీ చరిత్రలో తొలిసారి బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500కోట్లు కేటాయించారు. నిరుపేద బ్రాహ్మణులకు దీని ద్వారా ఉన్నత విద్య అవకాశం కల్పిస్తున్నారు. పెళ్లికి ఆర్థిక సాయం, వేద, ఆగమ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, అర్చకులకు సాయం, వారు మృతి చెందితే ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నారు. అలాగే వంశపార్య అర్చకత్వానికి కూడా తిరిగి పచ్చజెండా ఊపారు. జనాభాలో ఎక్కువశాతం ఉన్న కాపు, బలిజల ఆర్థికాభివృద్ధి కోసం కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. 2016లో రెండు వందలమంది దాకా విద్యార్థులను స్కాలర్‌షిప్పులతో విదేశీ విద్యకు పంపటంతోపాటు.. ఈ ఆర్థిక సంవత్సరం 58,685మందికి స్వయం ఉపాధి కింద లబ్ధి చేకూర్చాలని నిర్ణయించారు. బ్యాంకులు రుణాలివ్వకుండా ఇబ్బందులు సృష్టించటాన్ని అలా వుంచితే, ప్రభుత్వ కార్పొరేషన్ పరంగా ఇప్పటికి 26,690మంది ఖాతాలకు రాయితీల్ని విడుదల చేశారు. 2016 అక్టోబర్ వరకు ఉన్న లెక్కల ప్రకారం.. బీసీ కార్పొరేషన్ ద్వారా 17,665మందికి 64కోట్ల 44లక్షలు విడుదల చేశారు. ఏపీ వాషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ కింద 6,817మందికి 16కోట్ల 98లక్షలు, ఏపీ నాయీ బ్రాహ్మణ సొసైటీ ఫెడరేషన్ కింద 4,493మందికి 11కోట్ల 15లక్షలు, ఏపీ వడ్డెర కో ఆపరేటివ్ సొసైటీ నుంచి 3120మందికి 7కోట్ల 75లక్షలు, ఉప్పర సొసైటీ నుంచి 1135మందికి 2కోట్ల 83లక్షలు, వాల్మీకి బోయ సొసైటీ నుంచి 3260మందికి 8కోట్ల 6లక్షలు, కుమ్మర శాలివాహన సొసైటీ నుంచి 5679మందికి 14కోట్ల 11వేల రూపాయలు, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ కింద 2856మందికి 7కోట్ల 11లక్షలు, మేదర సొసైటీ నుంచి 963మందికి 2కోట్ల 40లక్షలు, క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా 689మందికి 5కోట్ల 2లక్షలు సాయం చేయడం ద్వారా ఆయా కులాలను ఆకర్షించే పనిలో వున్నారు. ఇదే వర్గానికి చెందిన పార్టీ నేతలకు ఆయా కార్పొరేషన్లు, సొసైటీలలో స్థానం కల్పించడం ద్వారా ఆయా కులాలకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు. రూ.48 కోట్లతో

బోయ ఫెడరేషన్ ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణలోలా బీసీల్లో ఎక్కువగా ఉన్న అత్యంత వెనకబడిన కులాలకు (ఎంబీసీ) కార్పొరేషన్‌కూ పదును పెడుతున్నారు. ఈ సంచార జాతులను తన వైపు మళ్లించుకోవడం ద్వారా భారీ స్థాయిలో లబ్ధి పొందవచ్చన్న వ్యూహం కనిపిస్తోంది. అదేవిధంగా అగ్రకులాలను ఆదుకునేందుకు ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న యోచన కూడా ఉంది. రెడ్డి, కమ్మ, వైశ్య, క్షత్రియ కులాల్లోని పేదలకు లబ్ధి చేకూర్చడం ద్వారా వారికి చేరువకావాలన్న తపన తెలుగుదేశం నాయకత్వంలో కనిపిస్తోంది.

చంద్రబాబు ఎంత చెప్పుకుంటున్నా, ప్రజల్లో ఆయన పాలన ప్రభావం చూపలేకపోతోంది. అవినీతి కొత్త పుంతలు తొక్కుతోంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్లు, అబద్ధాల ఉపన్యాసాలతో జనం విసిగిపోతున్నారు. ఇటీవల జగన్ దూకుడు పెంచి కార్యక్రమాలు చేయటం, ప్రజల్లో స్పందన పెరగటం, మరోవైపు తన కుమారుడు లోకేష్‌కి ఇటీవల ప్రభుత్వంలో అవకాశం కల్పించే ఏర్పాటు చేసినా ప్రమోట్ చేయాల్సి ఉండటంతో అప్రమత్తమైన చంద్రబాబు పార్టీ కార్యకర్తలను, కులాలవారీ ఓటుబ్యాంకును పెంచుకునే పనిని ముమ్మరం చేశారు. జగన్ వర్సెస్ లోకేష్ అనే వాతావరణం సృష్టించి, యువతను వంశపారంపర్య రాజకీయాలు దాటి ఆలోచించకుండా చేసి తెలుగుదేశాన్ని తిరిగి అధికారంలోకి తేవటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అమరావతి నిర్మాణాన్ని ఎన్నికల వరకూ నెట్టుకెళ్లి, రాజధాని+కుల రాజకీయాలతో లోకేష్‌కి పదవి కట్టబెట్టే యోచనలో ఉన్నారు.

## ఉపాధికి ఆచరణాత్మక పరిష్కారాలివి

శతాబ్దాల పర్యంతం కులవివక్షకు గురైనవారికి కొంత ఉపశమనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు అవసరమే. రిజర్వేషన్లు కావచ్చు, మరోటి కావచ్చు. ఇక్కడ కులం ప్రస్తావన కూడా తప్పనిసరి అవుతుంది. కానీ ఆ ఏర్పాట్ల ద్వారా ఒక స్థాయి లబ్ధి పొందినవారికి వాటిని మినహాయించటం, వివక్షకు గురైనవారు పరిమిత ప్రయోజనాల ఉపశమనాల కోసం తరాల తరబడి ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా వేగంగా, శాశ్వతంగా విముక్తి పొందేలా నాణ్యమైన విద్య, ఉపాధి వంటి ఏర్పాట్లను అందుబాటులోకి తేవటం వంటి చర్యలు చేపట్టాలి. షెడ్యూల్డ్ కులాల జాబితా రూపకల్పన వెనక డా॥ అంబేద్కర్ హేతుబద్ధ ఆలోచన ఇదే. ఇలా రాజ్యాంగ లక్ష్యం దిశగా వెళ్లాల్సిన పాలనను మళ్లీ వెనక్కి మళ్లించి కుల అస్తిత్వమే జీవనోపాధి అన్నట్టు చేయటం జాతి నిర్మాణానికి పెద్ద ద్రోహమవుతుంది.


పేదరికాన్ని, ఆర్థిక అంతరాల్ని తొలగించే విధానాలతో, బలమైన ప్రజాస్వామిక సంస్కృతితో అస్తిత్వాన్ని రీ ఇంజినీర్ చేసే రాజకీయం చేయకుండా ఎదిగే అవకాశాలకి, అధికారానికి కులాన్నే ప్రాతిపదిక చేయటం, ఎన్నికల్లో కోట్ల రూపాయల నల్లడబ్బు వెదజల్లి గెలిచి అధికారాన్ని కేంద్రీకరించటం, పార్టీల్ని వంశపారంపర్య ఆస్తులుగా మార్చుకోవటం.. వంటి భయంకర రుగ్మతలు తెలుగు రాష్ట్రాల్లోని యువత భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉండాలేగానీ.. ఉపాధి అవకాశాల్ని ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి తేవటానికి ఆచరణాత్మకమైన విధానాలు అందుబాటులో ఉన్నాయి. రాజధాని నుంచి అభివృద్ధిని, పాలనను వికేంద్రీకరించి స్థానికంగానే స్వయంపాలనకు నిధుల్ని అందుబాటులోకి తేవాలి. తెలంగాణలో 'గ్రామజ్యోతి' వంటి కార్యక్రమాల పట్ల నిర్లక్ష్యాన్ని వీడాలి. సాగునీరు, ఇతరత్రా వనరులు ఉన్న ప్రాంతాల్లో కూడా వ్యవసాయం లాభసాటిగా లేదని గుర్తించి, ఆ రంగం మీద ఆధారపడినవారిని తగ్గించకుండా యధాతథంగా కొనసాగించాలన్న విజన్‌పైనా తెలంగాణ ప్రభుత్వం పునరాలోచన చేయాలి. అసంబద్ధమైన ప్రాజెక్టుల మీద వెచ్చిస్తున్న డబ్బును తెలంగాణలోని పల్లెల మధ్యన చిన్న పట్టణాల అభివృద్ధికి కేటాయించాలి. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలి. వ్యవసాయాన్ని, రైతుల్ని నష్టాల్లో కొనసాగిస్తూ, చుట్టూ వున్న వ్యవసాయాధారిత వృత్తులకు పరిశ్రమ హోదా ఇస్తే యువతకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. అది కూడా కులంతో ముడిపెట్టి చేయటం చాలా అనర్థదాయకం అవుతుంది. కులంతో సంబంధం లేకుండా వృత్తులకు ప్రోత్సాహం, అందరికీ నాణ్యమైన విద్యతో కులవృత్తితో సంబంధం లేకుండా నచ్చిన రంగాన్ని ఎంచుకునే అవకాశం కల్పించాలి.

తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు, మంత్రులకబిడ్డలకు లభించిన చదువు, వేరే వృత్తులు, వ్యాపారాలు చేసుకునే అవకాశాలు తెలుగునాట ప్రతి బిడ్డకూ లభించాలి. దీంతోపాటు, వలసలు పోవాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి. ఇబ్బడిముబ్బడి ఉపాధికి ప్రోత్సాహం లభించేలా కార్మిక సంస్కరణల్ని అమలు చేయాలి. కులాన్ని, వృత్తిని వేరు చేసి ఈ చర్యలు తీసుకోలేకపోవటం రాజకీయ అసమర్థత, దివాళాకోరుతనం తప్ప సమర్థత, దార్శనికత అనిపించుకోదు. విప్లవాత్మకంగా కాకపోయినా, ప్రధాని నరేంద్ర మోదీ తరహాలోనైనా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మెరుగైన రాజకీయం కోసం కొంత ధైర్యాన్ని ప్రదర్శించాలి. ❍

# కులం తెగులుతో నవ్యాంధ్ర నవ్వులపాలు

- మూర్తి సుబ్రమణ్యం



'మీరే చెప్పండి. వేం మనుషులకు కాపలా కాయాలా? విగ్రహాలు, ఫ్లెక్సీలకు కాపలా కాయాలా? వీటిని ఎవరో ధ్వంసం చేస్తే - ఇంకెవరో రోడ్ల మీదకు రావడం, దానికి మమ్మల్ని నిందించడం ఏమిటి? ఈ కొత్త రాష్ట్రం ఎటు పోతోంది? విగ్రహాలు, ఫ్లెక్సీల నినాదాలతో కాలం వెళ్లదీస్తే నవ్యాంధ్రలో ఎవరైనా పెట్టుబడులు పెడతారా? ఇక్కడ అందరిదీ తలోదారి. ఇలాగైతే కొన్ని తరాలు కుమిలిపోవాల్సిందే..'

- నవ్యాంధ్రలో తాజా ఘటనలపై మానవతావాదిగా, సామాజిక బాధ్యతతో స్పందించే ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి ఆవేదనతో చేసిన వ్యాఖ్యలివి. ఏపీలో ప్రస్తుత పరిణామాలను పరిశీలిస్తే ఆ అధికారి చేసిన వ్యాఖ్యలు నిజమని స్పష్టమవుతుంది. ఉమ్మడి రాష్ట్రం నుంచి ఆంధ్ర ప్రాంతం కులాల చుట్టూనే పరిభ్రమిస్తోంది. 'కులం లేనిదే మనుషులు లేరు, మనుషులు లేనిదే కులం లేదన్నంత'గా కులవ్యవస్థ బలంగా నాటుకుపోయింది. కులాన్ని - సమాజాన్ని విడదీయలేనంత భయానక పరిస్థితి ఉంది. ఈ వైఖరి కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాతైనా మారుతుందనుకుంటే, మరింత వికృతరూపం దాల్చి అభివృద్ధికి అవరోధంగా మారుతోంది. ఎప్పుడో కొన్నేళ్ల క్రితం చనిపోయిన నాయకుల చుట్టూ ఇంకా కులరాజకీయాలు కొనసాగించి, పబ్బం గడుపుకునే నీతిమాలిన రాజకీయాలు నవ్యాంధ్రను మొదట్లోనే చిదిమేస్తున్నాయి. దీనికి ఏ పార్టీ మినహాయింపు కాదు.

నియామకాలు, ఎన్నికలు, ఎంపికలు, విమర్శలు, ఆరోపణలు అన్నీ కులం చుట్టూనే తిరుగుతున్న దౌర్భాగ్య పరిస్థితి నుంచి బైటపడకపోతే నవ్యాంధ్రకు అధోగతి తథ్యం! సమర్థత, ప్రతిభ కాకుండా కులమే బలమై, అదే గీటురాయిగా మారుతున్న పరిస్థితిని పాలకులు ప్రోత్సహించటం శ్రేయస్కరం కాదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ వంటి కీలక పదవులకూ కులమే ప్రాతిపదిక కావడం దౌర్భాగ్యం. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవికీ సమర్థత కాకుండా కులమే గీటురాయిగా మారిన వైనం ఆందోళన కలిగిస్తోంది. ఆ పదవికి పేర్ల చుట్టూ బోలెడు కులరాజకీయం జరిగింది. కొందరు టీడీపీ నేతలు ఆ పదవిని జగన్ సామాజికవర్గానికి చెందిన అధికారికి ఇంతవరకూ ఇవ్వలేదు కాబట్టి, ఆ కులానికి చెందిన అధికారిని ఎంపిక చేస్తే- జగన్ వర్గీయులంతా వచ్చే ఎన్నికల్లో సైకిల్ ఎక్కేస్తారని చంద్రబాబుకి సలహా ఇచ్చారట! దీన్ని ఖండించకుండా- 'అలాగే.. ఆలోచిద్దామ'ని బాబు చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు తరచూ 'మనం ఎక్కడికి పోతున్నాం? నాకర్థం కావడంలేదనే' ఊతపదం వాడుతుంటారు. ఇప్పటి నియామకాలు చూస్తే ప్రజలే పాలకులకు అలాంటి ప్రశ్న వేయాల్సి వస్తుంది.

బాబుకు సలహా ఇచ్చినవారి వ్యూహం నిజమనుకున్నా, అదే ప్రాతిపదికపై చేసిన ఎంపికల ఫలితాలు ఎందుకు బెడిసికొట్టాయన్న ప్రశ్నకు జవాబు దొరకదు. కాపు ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న రోజుల్లో ఆ కులం వారిని ఆకట్టుకునేందుకు, అదే సామాజికవర్గానికి చెందిన నండూరి సాంబశివరావును డీజీపీగా నియమించారు. కాపు కులస్థుడైన అధికారిని డీజీపీగా నియమిస్తే, ఆ కులం వారంతా సంతోషించి ముద్రగడ చేస్తున్న ఉద్యమానికి దూరంగా ఉంటూ, ప్రభుత్వానికి కృతజ్ఞత ప్రకటిస్తారని ఏలికల అంచనా. మరి.. ఆ తర్వాత ఏం జరిగింది? కాపు ఉద్యమం చల్లారకపోగా, ముద్రగడ మరింత మొండికెత్తగా ఆయన వెంటే కాపులు ఇంకా నడుస్తూనే ఉన్నారు. పాలకుల లెక్కలు నిజమైతే, అత్యంత ప్రాధాన్యం ఉన్న డీజీపీ పదవి ఇచ్చినందుకు కాపులు ప్రభుత్వంలోని పార్టీ పట్ల కృతజ్ఞతతో ఉద్యమానికి దూరంగా ఉండాలి గదా?! మరెందుకు అలా జరగలేదు? కాపు కార్పొరేషన్ నుంచి కోట్లాది రూపాయల రుణం తీసుకుంటున్న ఆ వర్గాలు కార్లు, ఆటోలపై ముఖ్యమంత్రి ఫోటోలకు బదులు ముద్రగడ, పవన్ ఫోటోలను ఎందుకు వేసుకుంటున్నారు?

ఒక కులానికి చెందిన వ్యక్తిని అందలమెక్కిస్తే ఆ సామాజికవర్గమంతా తమ వెంట ఉంటారన్న ఆలోచనే తప్పు. ఇటీవల బెజవాడలో వంగవీటి రంగా విగ్రహం ఒకచోట, చిరంజీవి, రంగా ఫ్లెక్సీలు మరొకచోట ధ్వంసం చేశారు. దీనిపై పెద్దరభసే జరిగింది. ముద్రగడ పాదయాత్ర నేపథ్యంలో ఇలాంటి ఘటన శాంతిభద్రతల కోణంలో ఆందోళన కలిగించేదే. ఆ క్రమంలో కాపు వర్గానికి చెందిన బెజవాడ టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమ తనయుడు స్వయంగా రంగా విగ్రహం వద్దకు వెళ్లి ఆయనచిత్రపటానికి నివాళులర్పించినట్టు వార్తలచ్చాయి. వంగవీటి రంగా పలువురు కాపులకు దైవం, కాంగ్రెస్ నేత. ప్రస్తుతం ఆయన వారసుడు వైసీపీలో ఉండటం, వైసీపీ కూడా కాపుల ఉద్యమానికి మద్దతు ప్రకటించి టీడీపీపై యుద్ధం ప్రకటించటం తెలిసిందే. అదే కాపు సామాజికవర్గానికి చెందిన బోండా ఉమ తనయుడు ఏ అభిమానంతో రంగా విగ్రహం వద్దకు వెళ్లి చిత్రపటానికి పూలమాల వేశారు? రాజకీయపరంగా ఎన్ని ఆరోపణలు చేసుకున్నా కులపరమైన అభిమానం మాత్రం మనసులో సజీవంగానే ఉందనుకోవాలా?

'అదనపు' ఓట్లు అవసరమైన మన ఎన్నికల వ్యవస్థలో కులపరంగా చేసే సమీకరణలు కొన్ని సందర్భాలలో ఉపయోగపడవచ్చు. ఈ పరిమితుల్ని గుర్తించటం, అధిగమించే ప్రయత్నం చేయటం లేదు. కుల సమీకరణలు చేయటం బెడిసికొడుతున్న సంకేతాలు కనిపిస్తున్నా చంద్రబాబు పట్టించుకోవటం లేదు. నవ్యాంధ్రలో కొత్తగా పుట్టిన చోటా జర్నలిస్టు సంఘాన్ని, చోటా జర్నలిస్టు నేతలనీ కులం కోణంలో ప్రోత్సహిస్తున్నారు. వారంతా బాబు పేరుతో మంత్రులనే శాసించి, వారిని తమ చుట్టూ తిప్పుకునే 'మార్కెటింగ్ మేనేజర్ల' స్థాయికి చేరారు. అవకాశాలు, ప్రతిభను పెంచే ఏర్పాట్లు లేకుండా కులమే గీటురాయి అయితే జరిగే దారుణాలు ఇంతకంటే భిన్నంగా ఉండవు.

ప్రస్తుతం నవ్యాంధ్రలో కులనేతల విగ్రహాలు శాంతిభద్రతలకు సవాలుగా మారే ప్రమాదం ఏర్పడింది. కమ్మ వర్గమంతా ఎన్టీఆర్, పరిటాల రవి, రెడ్డి వర్గమంతా వైఎస్, కాపులంతా వంగవీటి రంగా విగ్రహాలు విచ్చలవిడిగా ప్రతిష్టించాయి. వీటిలో వైఎస్ విగ్రహాలే ఎక్కువ. పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో వీటి సంఖ్య 50,000కు పైమాటేనన్నది ఒక అంచనా. వీటిలో 90శాతం అనుమతిలేకుండా ఏర్పాటైనవే. రెండు కులాల మధ్య




పోరాటానికి నవ్యాంధ్ర వేదికైన నేపథ్యంలో ఎక్కువగా రంగా, ఎన్టీఆర్ విగ్రహాలు, ఫ్లెక్సీల విధ్వంసాలు పెరిగిపోతున్నాయి. ఈ విగ్రహాలను కూల్చివేసినప్పుడల్లా రెండు వర్గాలవారూ మోహరించడం పోలీసులకు తలనొప్పిలా మారింది. అనుమతి లేని విగ్రహాలను తొలగించే సాహసం ప్రభుత్వం ఎందుకు చేయలేకపోతుందన్నది ప్రశ్న. రోగానికి కారణం తెలిసి కూడా మందు వేయకపోవడం, ఆ సమస్యలో భాగస్వామి కావడం కిందే లెక్క!

ఇక, ముద్రగడ ప్రారంభించిన కాపు ఉద్యమం ముదురుపాకాన పడుతోంది. ఆయన పాదయాత్ర తేదీలు ప్రకటించడం, దానిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించిన ప్రతిసారీ ఆ ప్రభావం మిగిలిన జిల్లాలపై పడుతోంది. కాపు ఉద్యమానికి పోటీగా అందులోనుంచి విడిపోయి బలిజలు ప్రారంభించే బీసీ ఉద్యమం తాజా మలుపు. కాపు కార్పొరేషన్‌ను విభజించి, బలిజ కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమకూ రాజకీయ న్యాయం చేయాలన్న డిమాండ్‌తో రేపు వాళ్లూ రోడ్డెక్కనున్నారు. కాపులతో తమకు సంబంధం లేదని, రేపటి బీసీ రిజర్వేషన్ ఉద్యమంలో తమది ఒంటరిపోరేనంటున్న బలిజలూ రాయలసీమలో పిడికిలి బిగిస్తే పరిస్థితి ఏమిటి? ఇవన్నీ సమాజానికి ఏం సంకేతాలిస్తున్నాయి? ఇలాంటి అరాచక, ఆందోళనకర పరిస్థితి కొనసాగితే ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు ముందుకొస్తారు? ప్రతిపక్షాలు రాజకీయ కోణంలో ఇలాంటి వ్యూహాలకు తెరలేపాయనుకున్నా, రేపు అవీ అధికారంలోకి వస్తే ఏలడానికి పనికిమాలిన కులవ్యవస్థ తప్ప ఏమీ మిగలదు కదా? పోలీసులు పరిమిత సిబ్బందితో ప్రజల ధన, మాన, ప్రాణాలకే ప్రాధాన్యం ఇవ్వాలా లేక ఇలాంటి ఉద్యమాలను నియంత్రిస్తూ విగ్రహాలు, ఫ్లెక్సీలకు కాపలాకాయాలా?

(ఆంధ్రభూమి సౌజన్యంతో)

# సామాజిక న్యాయమే ప్రగతికి సోపానం

- డా॥ జయప్రకాష్ నారాయణ్

**భా**రతీయ సమాజంలో మనం గర్వించదగ్గ లక్షణాలెన్నో ఉన్నాయి. అత్యధిక సంఖ్యాకులలో ధర్మనిరతి, పాపభీతి, సంయమనం, తృప్తి, పరస్పర అవగాహన, సామరస్యం, పెద్దల ఎడల భక్తి కానవస్తాయి. అందుకే ఎన్ని సమస్యలున్నా, ఎన్ని ఒడిదొడుకులు ఎదురయినా సమాజంలో సుస్థిరతకు మొత్తం మీద భంగం కలగటం లేదు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉండటంతో సామాన్యులకు బయటి ప్రపంచంలో ఎన్ని సంక్షోభాలు ఎదురయినా ఇంట్లో ఆప్తుల మధ్య ఊరట లభిస్తోంది. ఈ ప్రశాంతత, సుస్థిరతల వెనక ఎన్నో భయంకరమైన నిజాలు దాగి ఉన్నాయి. పుట్టుకతో వచ్చిన అసమానతల కారణంగా కోట్లమంది నిరంతరం దోపిడీకి గురవుతున్నారు.



ఎందరో బాధాసర్పదష్టులు గాయపడ్డ హృదయాలతో విలపిస్తున్నారు. అత్యధిక సంఖ్యాకుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కకుండాపోతోంది. కొద్దిమంది సుఖం కోసం, భద్రత కోసం ఎందరో తమ జీవితాలను బలిపెడుతున్నారు. ఆవేదన నుంచి ఆగ్రహం, ఆ కోపం నుంచి కసి, కసి నుంచి హింస పుట్టటం సహజం. గ్రామ ప్రాంతాలలో ఆ కసిని, హింసను సమాజం ఏదో ఒక విధంగా కొంతమేరకు అదుపు చేస్తోంది. ఒకరి ముక్కు, మొహం మరొకరు ఎరుగని పట్నవాసంలో మానవ సంబంధాలు పైపైన తప్ప లోతుగా ఉండవు కాబట్టి హింస ప్రజ్వరిల్లుతోంది. దీని మూలాలను వెదికి పట్టుకున్నప్పుడే సామాజిక శాంతిని సాధించగలం.

### చీకటి కోణాలు

మన దేశంలో కులవ్యవస్థ, సాంఘిక అసమానతలు ఏనాటి నుంచి వచ్చాయో చరిత్రకారులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. రుగ్వేదాన్ని ఆశువుగా రచించింది క్రీస్తు పూర్వం 1500 – 1000 మధ్యకాలంలోనని చాలామంది అభిప్రాయపడుతున్నారు. రుగ్వేదంలో ప్రకృతి వర్ణన, జీవితం పట్ల మక్కువ, ప్రపంచం పట్ల ఆరాధన ఎక్కువగా కనిపిస్తాయి. రుగ్వేదంలోని పురుషసూక్తంలో తొలిసారిగా కులాల ప్రస్తావన ఉంది. దానిని ఆ తరువాతి కాలంలో రుగ్వేదంలో చేర్చారని, నిజానికి రుగ్వేద సమాజంలో కులతత్వం లేదని చాలామంది చరిత్రకారులు చెబుతున్నారు. సృష్టికర్త శిరస్సు నుంచి బ్రాహ్మణులు, బాహువుల నుంచి క్షత్రియులు, ఊరువుల నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు జన్మించారని పురుష సూక్తంలో వర్ణించారు. ఆ భావనే తదుపరి కాలంలో బాగా స్థిరపడిపోయింది. ఈ నాలుగు వర్ణాలకు అతీతంగా, కులవ్యవస్థ బయట ఉన్న వారు పంచములు. వారే అంటరానివారు. ఇలా పుట్టుకతోనే మనుషులలో విభజనను తీసుకువచ్చిన సంస్కృతి మరొకటి లేదు. ఈ కులాల విభజన పుట్టుకతో వచ్చింది కాదని, కేవలం మనుషుల నైజాన్ని బట్టి వారి వృత్తులుండాలన్న ఉద్దేశంతో అలా చిత్రించారని ఇటీవలికాలంలో కొందరు పండితులు సిద్ధాంతీకరిస్తున్నారు. వాస్తవమేమంటే, మన సమాజంలో గత 3000 సంవత్సరాలుగా కులం పేరిట– పుట్టుక నుంచే మనుషుల మధ్య అధిగమించలేని అంతరాలను సృష్టించాం. అత్యధిక సంఖ్యాకులను దోపిడీకి గురిచేశాం. ఇదంతా గత చరిత్ర అవశేషమని, స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య రాజ్యాంగం అమలులోకి వచ్చాక కులానికి ప్రాముఖ్యం లేదని కొందరు వాదించవచ్చు. వాస్తవానికి రాజ్యాంగ విలువలకు, మన సమాజపు పోకడలకు మధ్య పొంతన లేదు. మనుషులంతా పుట్టుకతో సమానమేనని, కులం, మతం, ప్రాంతం, భాష, లింగ కారణాలుగా ఎలాంటి విచక్షణకు తావులేదని రాజ్యాంగం ఉద్ఘోషిస్తున్నా– సాంఘిక అసమానత, పుట్టుకతో వచ్చిన అంతరాలు, కులం పేరుతో ఏర్పడిన కృత్రిమ అడ్డుగోడలు మన సమాజాన్ని నేటికీ అతలాకుతలం చేస్తున్నాయి. ఇతర సమాజాలలో, సంస్కృతులలో అంతరాలు లేకపోలేదు. అవి ప్రధానంగా ఆర్థిక అసమానతల వల్ల వచ్చిన అంతరాలు. మన దేశంలో అలా కాదు. మతాన్నయినా ఓ మనిషి వదులుకోవచ్చు లేదా మార్చుకోవచ్చు కానీ ఓ కులంలో పుట్టాక, ఇక దాని నుంచి మన సమాజంలో విముక్తి లేదు. ఎంత కష్టపడినా, ఎన్ని ఫలితాలు సాధించినా 'కులం' అనే పంజరంలో నుంచి వ్యక్తి బయటపడలేడు. ఓ కొత్త మనిషి తారసపడగానే మన సమాజంలో అధిక సంఖ్యాకులకు వెంటనే కలిగే ఆలోచన

"అతడి కులమేమిటి?" అని! అవతలి మనుషుల కులం తెలియకపోతే, అతణ్ణి, లేదా ఆమెను మనసులో తగిన 'స్థాయిలో' చిత్రించుకోకపోతే, ఆ మనిషిని అంచనావేయటం మన సమాజంలో చాలామందికి అసాధ్యం. గుణగణాలు, ప్రతిభాపాటవాలు, సాధించిన విజయాలు, అతని వల్ల సమాజానికి జరుగుతున్న మేలు వంటి అంశాలను బట్టి కాక, కులాన్ని బట్టి మాత్రమే ఆ వ్యక్తిని అంచనా వేయటం మన ఆనవాయితీ. ఇలా పుట్టుకతోనే, ఆ మనిషి ప్రమేయం లేకుండానే ఆపాదించిన కులం ఆ వ్యక్తి భవిష్యత్తును శాసిస్తోంది. ఎంతోకొంత ప్రతిభా పాటవాలు వికసించే అవకాశాలుండి, వ్యక్తిత్వం సంతరించుకున్న వారికి కులం వల్ల అసౌకర్యం కలిగినా పెద్ద ప్రమాదం లేదు. ఎంతగా ఎదిగినా, సామర్థ్యాన్ని ప్రదర్శించినా కులం పేరుతో వివక్షణ చూపుతున్నారన్న మానసిక క్షోభ మిగిలిపోతుంది. అంతకుమించి కులం అలాంటి వాళ్ల జీవితాల మీద ప్రభావాన్ని పెద్దగా చూపకపోవచ్చు. కానీ సమాజంలోని దళిత వర్గాలలో అత్యధిక సంఖ్యాకుల జీవితాలు కేవలం పుట్టుక కారణంగా నిర్ణయమయిపోతున్నాయి. నేటికీ అస్పృశ్యత భావన వల్ల దళితులలో అత్యధికులు నిరాదరణకు, అవమానాలకు గురవుతున్నారు. చట్టం అస్పృశ్యతను నిషేధించవచ్చు. అంటరానితనాన్ని తీవ్రమైన నేరంగా పరిగణించవచ్చు. దళితులుగా పుట్టినవారిని వెలివేయటం, దూరంగా ఉంచటం, తక్కువవాళ్లుగా భావించటం ఈనాటికీ పెద్దఎత్తున కొనసాగుతోంది. బాల కార్మికుల విషయానికొస్తే మన దేశంలో చిన్ననాడే రెక్కలు ముక్కలు చేసుకుని పొట్ట నింపుకుంటూ, దుర్భర జీవనాన్ని గడుపుతూ, పసిప్రాయంలోనే వడలిపోతున్న చిన్నారులలో నూటికి 90మంది దళిత కుటుంబాల నుంచి వచ్చినవారే. అక్షర జ్ఞానం లేకుండా, ప్రకృతి ప్రసాదించిన మేధాశక్తి వృథాగా పోతున్న నిరక్షరాస్యులలో అత్యధికులు అణగారిన కులాలవారే. అంటే కేవలం పుట్టుకతోనే 'కులం' ముద్రపడ్డ కారణంగా కోట్ల మందికి భవిష్యత్తు పట్ల ఏ ఆశా లేకుండా పోతోంది.

సమాజంలో కనీస ఆరోగ్యానికి సరయిన వసతులను కల్పించకపోవటంతో బీదలు, దళితులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. సులభంగా నివారించదగ్గ వ్యాధులకు గురైన లక్షలమంది అకాల మృత్యువాత పడుతున్నారు. బాలారిష్టాలను దాటి ఎదిగినవారికి ఏ చిన్న జబ్బు వచ్చినా సకాలంలో సరయిన వైద్యం అందక అలమటిస్తున్నారు. చాలా తేలిగ్గా మందులతో నయం చేయగలిగిన మలేరియా వచ్చినా సరయిన వైద్యం లభించక సామాన్యుల సంపన్నులకన్నా ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. విలువయిన కాలాన్ని కోల్పోతున్నారు. అస్వస్థత కారణంగా పనిచేయలేక, సంపాదన లేక, రెక్కాడితేగానీ డొక్కాడని కారణాల పస్తులుంటున్నారు. కేవలం ఒక్కసారి ఆసుపత్రిలో మంచానపడ్డ కారణంగా 40శాతం కుటుంబాలు విలువైన తమ స్థిర, చరాస్తులను అమ్ముకోవాల్సి వస్తోంది. లేదా పెద్ద మొత్తంలో వడ్డీలకు అప్పులు తీసుకోవలసి వస్తోంది. అనారోగ్య కారణంగా 25శాతంమంది బీదరికంలోకి జారిపోతున్నారు. పారిశుద్ధ్యం లేక, మరుగుదొడ్ల సౌకర్యం లేక 70శాతం మంది ప్రజలు అసౌకర్యానికి, అనారోగ్యానికి గురవుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తు, వారి శారీరక శ్రమకు తగిన గౌరవం, ప్రతిఫలం లభించకపోవటం మరో ఎత్తు. ఒక ఇంట్లో పనిమనిషి నెలపర్యంతం గొడ్డుచాకిరీ చేస్తే ఓ పూట తిండి పెట్టి నెలకు ఐదారొందల రూపాయలు జీతం ఇస్తే చాలా ఎక్కువ అనుకుంటున్నాం. అమెరికా, ఐరోపా దేశాలకు మన పిల్లలు వెళ్లాలని కలలుకంటున్న మనం– ఆ దేశాల సిరిసంపదలను దృష్టిలో ఉంచుకుంటున్నామే తప్ప ఆయా సమాజాల్లో శ్రమకు ఇచ్చే గౌరవాన్ని, విలువను గుర్తించటం లేదు. మన పిల్లలు ఆ దేశాలలోని హోటళ్లలో సర్వర్లుగా పనిచేసినా, కంచాలు కడిగినా మనకు అభ్యంతరం లేదు. కానీ మన దేశంలో మాత్రం తిన్న కంచాన్ని తీయటం మన హోదాకు, దర్పానికి భంగంగా భావిస్తున్నాం. ఆ పనులు చేసేవాళ్లను చాలా తక్కువవాళ్లుగా ఈసడిస్తున్నాం. పనివాళ్లను ఆదరంగా చూసే ఇళ్లలో కూడా, వాళ్ల పిల్లల చదువుల పట్ల శ్రద్ధగానీ, వాళ్ల ఆరోగ్యం పట్ల ఆసక్తిగానీ యజమానులకు ఉండవు. మన దగ్గర పనిచేసే వాళ్ల శ్రమకు గుర్తింపు, విలువ, గౌరవం లేకపోతే నష్టపోయేది మనమే. ఏ సంపన్న సమాజంలోను అతి తక్కువ ఖర్చుతో ఇంతటి సుఖాలు అందవు. ఆ దేశాలలో కోటీశ్వరులు కూడా తమ కారు నడపటానికి డ్రైవరును, ఇంట్లో వంటమనిషిని భరించలేరు. అలాంటిది మన దేశంలో బలవంతంగా అసంఘటిత కార్మికుల వేతనాలను తక్కువ స్థాయిలో ఉంచుతున్నాం. వాళ్ల పిల్లలకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నాం. వారి జీవితాలకు భద్రత లేకుండా పోతోంది. ఆపైన "మనం ఎంత ఆప్యాయంగా చూసుకున్నా వారికి మన మీద కసి ఎందుకో" అని వాపోతున్నాం!

### మండే గుండెల్లో నుంచి హింస

గత శతాబ్దాలలో పుట్టుకతో వచ్చిన సాంఘిక అసమానతలను, కుల వ్యవస్థను, బానిసత్వాన్ని దళితులు, బీదలు భరించారు. తమ 'కర్మ' అని సరిపెట్టుకున్నారు. వచ్చే

జన్మలోనైనా పరిస్థితి బాగుపడకపోతుందా అని ఎదురుచూశారు. ఆధునిక యుగంలో కూడా వారు అలాగే పడివుంటారని, పడివుండాలని ఆశించటం మూర్ఖత్వం. అమానుషం. మానవ విలువల పట్ల ఎంతో కొంత అవగాహన, గౌరవం పెరిగిన కాలం మనది. పుట్టుకతో ఏ అంతరాలు ఉండరాదని, ప్రతి బిడ్డకూ ప్రకృతి ప్రసాదించిన శక్తిసామర్థ్యాల మేరకు ఎదిగే అవకాశం ఉండాలని విశ్వసించే ఆధునిక యుగంలో మనం నివసిస్తున్నాం. మన శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, రాజకీయాలు, రాజ్యాంగం వీటన్నింటినీ అందుకు అనుకూలంగా మలచుకున్నాం. మన బిడ్డలు ఎదగటానికి అవసరమయిన సంస్థాగత ఏర్పాట్లే దళితులు, బీదల ప్రగతికి సోపానం కావాలి. అది జరగకపోతే రాజ్యాంగ విలువలకు, సమాజ సంప్రదాయాలకు మధ్య సంఘర్షణ అనివార్యం. మండే గుండెల్లో నుంచి హింస పుట్టక మానదు. ఆ హింసాగ్నికి మంచి చెడులతో నిమిత్తం లేకుండా ఎందరో బలికాక తప్పదు. హింస పట్ల భయం మాత్రమే పరిస్థితులలో మార్పును ఆహ్వానించటానికి కారణం కారాదు. బలవంతంగా ఇతరులను అణచిఉంచడం కోసం మనం కూడా కుంగిపోవలసి వస్తోంది. ఆ కారణంగా అందరి అభివృద్ధి కుంటుపడుతోంది. బీదపిల్లలకు విద్యావకాశాలు లేకపోతే, ఆ బిడ్డలు ఆలనాపాలనా లేకుండా పెరిగితే, రేపు ఆ పిల్లలే హింసకు, అరాచకత్వానికి, నేరాలకు పాల్పడే ప్రమాదం ఉంది. నేరస్తులు ఎక్కడినుంచో దిగుమతి కావటం లేదు. పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారు. నేడు మనం చేస్తున్న ఘోర తప్పిదాలే రేపు సమాజంలో మనందరికీ ఉరితాళ్లవుతాయి. ఎవరిపైనో దయాదాక్షిణ్యాలు చూపుతున్నామని కాకుండా, మన భవిష్యత్తు పట్ల, బిడ్డల పట్ల మమకారంతో ఆలోచించాలి. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగితే అది అందరి ప్రగతికి దోహదపడుతుంది. అందుకు రాజ్యవ్యవస్థలోను, సమాజంలోను అవిశ్రాంత పోరాటం అవసరం. నిజమయిన రాజకీయాలకు, సామరస్య సమాజానికి సరయిన అర్థం అదే.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా ఏప్రిల్ 1, 2003న ఈనాడులో ప్రచురితమైన వ్యాసం) ❍

# మిల్లులు తెరిచేవరకూ పోరాటం: లోక్‌సత్తా

విజయనగరం జిల్లాలో జ్యూట్‌మిల్లులు మూతపడి వేలాదిమంది కార్మికులు రోడ్డునపడ్డా మంత్రులు, ఎమ్మెల్యేలకు పట్టటం లేదని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ధ్వజమెత్తారు. జిల్లా ప్రజలు మంచివారు కావటంతో సహనాన్ని పాటిస్తున్నారని, దీన్ని బలహీనతగా భావించవద్దని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మిల్లులు తెరిపించుకునే దిశగా కలిసి పోరాడదామని పిలుపునిచ్చారు. జిల్లాలోని జ్యూట్ మిల్లులను తెరిపించాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అరుణా జ్యూట్‌మిల్లు వద్ద ఏర్పాటు చేసిన కార్మికుల సభలో బాబ్జీ మాట్లాడారు. ఒక్క అరుణా జ్యూట్‌మిల్లు మీదే 3,500మంది కార్మికులు ఆధారపడివున్నారన్నారు. మంత్రులు అశోక్‌గజపతిరాజు, మృణాళినికి పరిస్థితి అర్థమయ్యేలా మీ పిల్లల చేత ఎస్ఎంఎస్‌ల పోరాటం చేయించండి అని బాబ్జీ విజ్ఞప్తి చేశారు. అశోక్‌గజపతిరాజు మొబైల్ నెంబరు 9440822599, మృణాళిని నెంబరు 7093931399కు మన నిరసన హోరెత్తాలన్నారు. మిల్లులు తెరిపించేవరకూ కార్మికులకు, సంఘాలకు లోక్‌సత్తా అండగా ఉంటుందన్నారు. పలువురు కార్మికులతోపాటు లోక్‌సత్తా పార్టీ నాయకులు తాతారాజు రాజారావు, శిమ్మ శ్రీను, ఎం. చిన్నారావు,





తిప్పాన కోటేశ్వరరావు, అల్లంశెట్టి నాగభూషణం, రంది రవి, భూడి సన్యాసినాయుడు, కడగళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు. ❍


# మళ్లీ మనమే నెం.1

- యువత, పేదలకు శాపంగా అవినీతి
- నినాదాలు తప్ప సరైన విధానాలు లేకపోవటం వల్లే నిరోధించలేకపోతున్నాం



సంక్షేమం ముసుగులో అవినీతికి పాల్పడుతున్న నాయకులు, వారి అండతో లంచాలు బొక్కుతున్న ప్రభుత్వాధికారుల వల్ల భారత్‌లో ప్రజల నిజమైన ఎదుగుదలకు కావలసిన నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటివి అందటం లేదని లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చెబుతున్న మాటల్నే 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' తాజా సర్వే కూడా చెప్పింది. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని 16దేశాల్లో.. భారత్‌లోనే అవినీతి ఎక్కువని తేల్చింది. భారత్‌లో ప్రతి పదిమందిలో దాదాపు ఏడుగురు (69శాతం మంది) అవినీతి బాధితులేనని తేల్చింది. భారత్‌లో లంచం ఇచ్చేవారిలో అత్యధికులు (73శాతం) పేదలు, యువతేనని తెలిపింది. అవినీతిపై పోరాడుతున్న ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్.. 'పీపుల్ అండ్ కరప్షన్: ఏసియా పసిఫిక్' పేరుతో ఈ సర్వేను విడుదల చేసింది. భారత్, చైనా, పాకిస్తాన్, శ్రీలంక, మలేషియా, కంబోడియా, ఇండొనేషియా, థాయ్‌లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ధ్రువీకరణ పత్రాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, పోలీసులు, న్యాయస్థానాలు తదితర ప్రభుత్వ సేవలు పొందేందుకు సుమారు 90కోట్లమంది ఒక్కసారైనా లంచం ఇచ్చారు. వీరిలో ఎక్కువమంది భారత్‌లోనే వారే. భారత్‌లో అవినీతిలో పోలీసు వ్యవస్థ మొదటిస్థానంలో ఉందని 85శాతం మంది చెప్పగా, అధికారులు, ఎంపీలు, వ్యాపారవేత్తలు, స్థానిక కౌన్సిలర్లు తర్వాతి స్థానాల్లో ఉన్నారు. మతపెద్దలు, బాబాలు కూడా అవినీతిపరులేనని పలువురు వాపోయారు. ఆరోగ్యసేవలకు 59శాతం మంది, విద్యావిషయాల్లో 58శాతం మంది లంచాలిచ్చారు.

"అవినీతి చిన్న నేరం కాదు. ఇది నోటి వరకూ వచ్చిన ఆహారాన్ని అందకుండా చేస్తుంది. చదువు, సరైన వైద్యసేవలు అందకుండా చేస్తుంది. ఇది మనిషి చావుకూ కారణం కాగలదు. తగిన చట్టాలను పటిష్టంగా అమలు చేయకపోతే అవినీతికి అడ్డుకట్టపడదు" అని సంస్థ ఛైర్మన్ జోస్ కార్లోస్ ఉగాజ్ హెచ్చరించారు. నరేంద్ర మోదీ పై వ్యక్తిగత అవినీతి ఆరోపణలు లేనప్పటికీ, సాంకేతికత వినియోగం, పెద్ద నోట్ల రద్దు వంటి చర్యలతో అవినీతి నిరోధానికి కష్టపడుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అవినీతి తగ్గలేదని తాజాగా పలు వార్తలు, వ్యక్తిగత అనుభవాలు సైతం రుజువు చేస్తున్నాయి. పై నుంచి కింది దాకా ఎక్కడా లంచాలు, ఎన్నికల్లో నల్లధనం ఖర్చు ఆగలేదు. దేశంలో అవినీతిని కట్టడి చేయటానికి సంకల్పం, నినాదాలు



## తాత్కాలిక తాయిలాల నేతలతో నష్టమే!

ప్రభుత్వ వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయి సరైన సేవలు అందించక పోవటం వల్లే తాత్కాలిక తాయిలాల జనాకర్షక నేతలు పెరుగుతూంటారు. జనం తమ రోజువారీ అవసరాల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లటానికి ధైర్యం చేయలేక రాజకీయ నాయకుల మీద ఆధారపడుతుంటారు. సహానుభూతి, సానుభూతి, మనోడే.. లాంటి ముసుగులుగా ధరించి జనానికి పైపై పనులు చేసి పెడుతూ ఈ జనాకర్షక నేతలు అయినకాడికి దండుకుంటుంటారు. ఇందుకోసం ప్రజాస్వామ్య వ్యవస్థల్ని బలపడకుండా దెబ్బతీస్తుంటారు. ఉదాహరణకు చట్టసభకు ఎన్నికైన ఎమ్మెల్యే లేదా ఎంపీ చట్టాలు చేసే పనిచేయకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో పైరవీలు చేస్తూ ప్రజలకు పనులు చేసి పెడుతున్నట్టు నటిస్తుంటారన్న మాట. ఇలా ప్రజలకు, తనకు వారధిలా పనిచేయటానికి ఓ కార్యకర్తల ముఠాని తయారుచేసుకుని నెలకి రూ. 10లక్షల చొప్పున వెచ్చిస్తుంటారు. ఎన్నికల్లో పెట్టిన ఖర్చుకు, ఇలా అవినీతి ప్రభుత్వ యంత్రాంగంతో పనులు చేయించిపెట్టే పార్టీ యంత్రాంగాన్ని నిర్వహిస్తున్నందుకు.. సదరు జనాకర్షక నేత అంతకు పదిరెట్లు దోచుకుంటాడు. లోక్‌సత్తా పదేపదే చెబుతున్న ఈ ప్రజాస్వామిక రాజకీయ సంక్షోభాన్ని కూడా ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ధృవీకరించింది. అవినీతి పట్ల ప్రజల్లో వ్యతిరేకతను ఆసరాగా తీసుకుని అవినీతిని అంతం చేస్తాం, ప్రత్యేక అధికారాలు లేకుండా చేస్తాం అని విధానాలు లేకుండా కేవలం నినాదాలతో వచ్చే తాత్కాలిక తాయిలాల నేతల్ని నమ్మటం సరికాదని, ఇలాంటి వారితో సమస్యలు మరింత పెరుగుతాయని పేర్కొంది.

| | |
|---|---|
| పోలీసులకు | 85% |
| అధికారులకు | 84% |
| బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లకు | 79% |
| స్థానిక నేతలకు | 78% |
| ఎంపీలకు | 76% |
| పన్ను అధికారులకు | 76% |
| మత పెద్దలకు | 71% |
| న్యాయమూర్తులకు | 66% |
| ఉన్నతాధికారులకు | 59% |

ఏ సేవకు ఎంత..!

| | |
|---|---|
| విద్యకు | 57% |
| వైద్యసేవలకు | 59% |
| మీసేవ, ఇతర కేంద్రాల్లో | 46-60% |
| పోలీసుల సేవలకు | 58% |
| న్యాయ సేవలకు | 30&45% |

మాత్రమే చాలవని, అందుకు తగ్గ విధానాలను కూడా అమలు చేయాలని మన అనుభవాలు రుజువు చేస్తున్నాయి. ఇందుకోసం లోక్‌సత్తా తొలి నుంచీ కోరుతున్నట్టు.. పైస్థాయిలో ఆస్తుల జప్తు వంటి ఏర్పాట్లతో బలమైన అవినీతి నిరోధక చట్టం, దిగువస్థాయిలో హక్కుగా పౌరసేవల చట్టం, ఎన్నికల సంస్కరణలు, స్థానిక సాధికారత వంటి చర్యలు అవసరం. ప్రభుత్వ కార్యాలయాల్లో తమకు హక్కుగా అందాల్సిన సేవలకు గతిలేక లంచం ఇచ్చే పౌరులను కూడా శిక్షించాలనే అర్థం లేని 17 'ఏ' ప్రతిపాదనను అవినీతి నిరోధక చట్టం నుంచి మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. లాలూచీ పడి లంచం ఇచ్చే, తీసుకునేవారి పట్ల మాత్రం మరింత కఠినంగా వ్యవహరించే ఏర్పాటు చేయాలి. ❍

## బడ్జెట్ సమావేశాలలోనే ఆమోదించాలి

హక్కుగా పౌరసేవలు అందించే చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాలలోనే ఆమోదించాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ చట్టం కోసం లోక్‌సత్తా తొలి నుంచీ పోరాడుతోందని, కేసీఆర్ ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉందని భావిస్తున్నామని అన్నారు. పౌర సేవల చట్టాన్ని ఈ సమావేశాల్లో తీసుకురాకపోతే ప్రజాచైతన్య కార్యక్రమాలతో ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యదర్శులు జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, అధికార ప్రతినిధి నందిపేట రవీందర్,



కార్యదర్శి నిఖిల్, కార్మికసత్తా రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, యువసత్తా, విద్యార్థిసత్తా రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు. ❍

# అవినీతిని రద్దు చేయలేకపోయిన ప్రభుత్వం



పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని వ్యతిరేకించినవారిని దేశద్రోహులు అనటం అప్రజాస్వామికమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

'ఒకరి నిర్ణయాలను వ్యతిరేకిస్తే దుర్మార్గులు, అవినీతిపరులు, దేశద్రోహులు అంటూ దాడిచేయటం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. హేతుబద్ధమైన ఆలోచన చేయకుండా తన విధానాన్ని కాదన్నవారిని శత్రువుల్లా చూడటమనేది అణుబాంబు దాడి లాంటిది. తన విధానాలను వ్యతిరేకించి నప్పటికీ సుభాష్‌చంద్రబోస్ దేశభక్తిని, చిత్తశుద్ధిని గాంధీజీ ఎన్నడూ శంకించలేదు" అని జేపీ అన్నారు.

బ్యాంకింగ్ రంగ నిపుణుడు తుమ్మల కిషోర్ రాసిన 'పెద్ద నోట్ల రద్దు: లక్ష్యాలు – సాధ్యాసాధ్యాలు – సాధకబాధకాలు' పుస్తకాన్ని జేపీ ఇటీవల హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఎమెస్కో పబ్లికేషన్స్ దీన్ని ప్రచురించింది.

ప్రజాస్వామ్యంలో ప్రజలకు హక్కులు ఉన్నాయని, ప్రభుత్వం జవాబుదారీతనంతో వ్యవహరించాలని జేపీ అన్నారు. ప్రభుత్వాలు ప్రజాధనాన్ని వృథా చేస్తూ రాజభవనాలు నిర్మించటం ప్రపంచదేశాలలోనే ఎక్కడాలేని విధంగా మనదేశంలోనే ఉందన్నారు. నోట్ల రద్దు (డీమానిటైజేషన్) సమయంలో ప్రజలకున్న రాజ్యాంగపరమైన హక్కులను కడాపాడటంలో సుప్రీంకోర్టు విఫలమైందని, సమస్య తీవ్రత దృష్ట్యా తగిన ఆదేశాలనిచ్చి ఉండాల్సిందని వ్యాఖ్యానించారు. అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దుందుడుకు చర్యలను అక్కడి న్యాయవ్యవస్థలు అడ్డుకుంటున్న విషయాన్ని గుర్తుచేశారు.

దేశ ప్రయోజనాల రీత్యా పెద్ద నోట్ల రద్దు నిర్ణయం మంచిదే అయినప్పటికీ, అమలులో ప్రజలకు ప్రత్యామ్నాయాలు చూపటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని జేపీ అన్నారు. సామాన్య ప్రజలు మూడు నెలలపాటు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారన్నారు. దినసరి కూలీలు పనులు లేక దుర్భర జీవితాన్ని గడిపారన్నారు. ఆర్థిక వ్యవస్థ ఎప్పటికప్పుడు పటిష్టంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.

పెద్ద నోట్ల రద్దుతో అవినీతి పోతుందని ప్రజలు ఎంతో ఓపిగ్గా కష్టాల్ని సహించినా, అవినీతి మాత్రం యథాతథంగానే కొనసాగుతోందని జేపీ అన్నారు. డీమానిటైజేషన్ తర్వాత అవినీతి కొత్త రూపాల్ని సంతరించుకుంటోందని, ప్రతి రోజూ రూ. 10,000 కోట్ల నల్లధనం ఉత్పత్తి అవుతోందని అన్నారు. ఉన్నత స్థాయి అవినీతిని, దిగువస్థాయిలో ప్రజల రోజువారీ జీవితంలో అవినీతిని కట్టడి చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వోద్యోగులు ప్రజల నుంచి లంచాలు గుంజి వేధిస్తుంటే ప్రభుత్వం గుర్తించకపోవటం సిగ్గుచేటన్నారు. అవినీతి అంతానికి.. పౌర సేవల చట్టం నుంచి ఎన్నికల సంస్కరణల దాకా పలు చర్యల్ని వేగంగా చేపట్టాల్సిన బాధ్యత మోదీ ప్రభుత్వం మీద ఉందన్నారు.

డీమానిటైజేషన్ వల్ల ప్రజలు పడ్డ కష్టాలను పుస్తకంలో క్లుప్తంగా వివరించానని, నోట్ల రద్దు తర్వాత రిజర్వు బ్యాంకు జారీ చేసిన కరెన్సీ మొత్తం నగదు రూపంలో బ్యాంకులకు చేరిందని, ఇక నగదు రూపంలో నల్లధనం ఎక్కడ ఉందో తెలియాల్సి ఉందని పుస్తక రచయిత కిషోర్ అన్నారు. అవినీతి, నల్లధనం దేశ వెన్నెముక మూలుగను పీల్చివేస్తున్నాయని 'ఈనాడు' జర్నలిజం స్కూలు ప్రిన్సిపల్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. దేశంలో నేటికీ ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత లేకపోవటం పెద్ద లోపమన్నారు.

కార్యక్రమంలో భారత్ టీవీ చీఫ్ ఎడిటర్ జి.వల్లీశ్వర్, ఆంధ్రప్రదేశ్ పత్రిక చీఫ్ ఎడిటర్ రమేష్ కందుల, సీనియర్ జర్నలిస్టు శంకర్‌నారాయణ్ ఎమెస్కో చీఫ్ ఎడిటర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎమెస్కో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ❍

# పౌరసమాజాన్ని ఎమ్మెల్సీలుగా కూడా ఎన్నికవనివ్వరా?

**పార్టీలతీరును ఖండించిన జేపీ.. లోక్‌సత్తా బలపరిచిన ప్రజా అభ్యర్థులకు తొలి ప్రాధాన్య ఓటు వేయాలని ఏపీ ఉపాధ్యాయులు, పట్టభద్రులకు విజ్ఞప్తి**

కొన్ని రకాల బిల్లుల్ని కొన్ని రోజుల పాటు నిలిపివుంచటం తప్ప ఎటువంటి అధికారాలూలేని శాసన మండలి ఎన్నికల్లో కూడా పౌర సమాజానికి, పార్టీలకతీతంగా ఆలోచించ గలిగినవారికి గొంతు లేకుండా రాజకీయ పార్టీలు కబ్జా చేస్తున్నాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో (మార్చి 9న) ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, కేంద్ర మంత్రులు వచ్చి ప్రచారం చేయటం.. పదవుల పిచ్చికి, మితిమీరిన పార్టీతత్వానికి పరాకాష్ట అన్నారు. సమాజంలో నిజాయతీ, విజ్ఞత గల మేధావులు, సమర్థులు అసెంబ్లీ, పార్లమెంటుకు ఎన్నికయ్యే వాతావరణాన్ని కల్పించటానికి చర్యలు తీసుకోవాల్సింది పోయి.. వారు ఎన్నికకు కాస్తో కూస్తో అవకాశమున్న మండలి ఎన్నికలను కూడా పార్టీ రాజకీయాలతో దురాక్రమణ చేస్తున్నారన్నారు.


కొందరు వ్యక్తుల, కుటుంబాల సొంత సామ్రాజ్యాలుగా మారిన పార్టీలు తప్ప సమాజంలో ఎవరూ రాజకీయాలు మాట్లాడకూడదన్నట్టు వ్యవహరించటం, ప్రతి చోటా పౌర సమాజాన్ని అణచివేయటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని జేపీ అన్నారు. తమ అభ్యర్థులకు ఓటు వేయకపోతే జరిగే పరిణామాలపై హెచ్చరికలు జారీ చేయటం వంటి చర్యలు పాలకులకు, పార్టీలకు తగదన్నారు.

**జోక్యం చేసుకోకూడదనుకున్నా కానీ..**

ఈ నేపథ్యంలోనే పార్టీలతో సంబంధం లేకుండా ఉత్తరాంధ్ర, రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అర్హులైన అభ్యర్థులకు మద్దతివ్వాలని లోక్‌సత్తా నిర్ణయించిందని జేపీ తెలిపారు. లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి, రాష్ట్ర కమిటీ అభ్యర్థుల మద్దతుపై చర్చించి నిర్ణయం తీసుకున్నారని, తాను జోక్యం చేసుకోకూడదనుకున్నా, పార్టీల వికృత రాజకీయాలను చూసి స్పందిస్తున్నానన్నారు.

ప్రత్యేక హోదా పన్ను రాయితీలు, రైల్వే జోన్, విద్యారంగంలో ప్రమాణాలు పెంచటం, యువతకు నైపుణ్యం, ఉపాధి అవకాశాలు కల్పించటం వంటి అంశాలతోపాటు స్థానిక సమస్యలపై నిరంతరం స్పందిస్తూ ప్రజల కోసం పనిచేసిన చరిత్ర ఉన్నవారికి లోక్‌సత్తా మద్దతిస్తోందని, ఉపాధ్యాయులు, చదువుకున్నవారు, యువత ఈ అభ్యర్థులకే తమ తొలి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

**లోక్‌సత్తా బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు: వి.వి రమణమూర్తి** (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం), **డా॥ గేయానంద్** (అనంతపురం, కడప, కర్నూలు (పశ్చిమ రాయలసీమ) పట్టభద్రుల నియోజకవర్గం), **పోచంరెడ్డి సుబ్బారెడ్డి** (అనంతపురం, కడప, కర్నూలు (పశ్చిమ రాయలసీమ) ఉపాధ్యాయుల నియోజకవర్గం). ❍



## విజయనగరంలో ఓటు వేసిన బాబ్జీ

లోక్‌సత్తా బలపరిచిన అభ్యర్థుల తరపున పార్టీ నేతలు విస్తృత ప్రచారం చేశారు. భీశెట్టి బాబ్జీ విజయనగరం సంస్కృత కళాశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



# అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్లకు జేపీ సంఘీభావం



అగ్రిగోల్డ్ సంస్థల డిపాజిట్‌దారులు, ఏజెంట్లకు పూర్తి న్యాయం జరిగేలా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. బాధిత ఖాతాదారుల జాబితాను, ఆస్తుల వివరాలను పారదర్శకంగా ప్రజలముందుంచాలన్నారు. సమాచారాన్ని జాప్యం లేకుండా న్యాయవ్యవస్థకు అందించి, త్వరితగతిన సమస్య పరిష్కారమయ్యేలా సహకరించాలన్నారు.

**అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హైదరాబాద్‌లో జేపీని కలిసి సమస్యల్ని వివరించారు. సహాయసహకారాలు కోరుతూ వినతి పత్రం అందించారు. అగ్రిగోల్డ్ ఆస్తులు వివిధ రూపాలలో ఉన్నా పూర్తి వివరాలు రాకుండా, మార్కెట్‌లో ఎక్కువ ధర పలకకుండా ప్రభుత్వంలోనివారు, కొందరు రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారని వారు ఆరోపించారు.**

ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ, కేసును న్యాయస్థానం పర్యవేక్షణలో ఉన్నందున న్యాయపరమైన స్పష్టతతో వ్యవహరించాలని, సహారా తరహాలో ముందు బ్యాంకుల బకాయిల కన్నా ఖాతాదారులకు చెల్లింపులు జరిగేలా చూసుకోవాలని సూచించారు. బాధితుల్లో ఎక్కువమంది పేద, మధ్యతరగతివారు ఉన్నందున తొలుత వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. వెల్లడికాని ఆస్తుల విషయంలో బినామీ చట్టాన్ని వర్తింప చేయటానికి సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలించాలన్నారు. ఇవన్నీ పకడ్బందీగా ఉంటే న్యాయం కోసం సుప్రీంకోర్టు దాకా వెళ్లవచ్చన్నారు. అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్లకపోరాటానికి సంఘీభావాన్ని తెలియచేశారు.

అసోసియేషన్ ప్రతినిధులు విశ్వనాథరెడ్డి, ఈవీ నాయుడు, సిద్ధేశ్వర్, నాగేశ్వరరావుతోపాటు లోక్‌సత్తా పార్టీ అధికార ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ తదితరులు జేపీతో సమావేశంలో పాల్గొన్నారు. ❍

## దీక్షా శిబిరం సందర్శన



రాష్ట్రంలో అగ్రిగోల్డ్ డిపాజిట్‌దారులకు న్యాయం జరిగేలా చూడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. అగ్రిగోల్డ్ లావాదేవీల్ని నిలిపివేసిన దగ్గర్నుంచి చనిపోయిన డిపాజిట్‌దారులు, ఏజెంట్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితుల శిబిరాన్ని సందర్శించి లోక్‌సత్తా పార్టీ తరపున మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ డిపాజిట్‌దార్ల అసోసియేషన్ నాయకులు నాయుడు, శ్రీను, ప్రకాష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ❍



ఢిల్లీ అధికార పీఠంలో ఒక వార్త కలకలం రేపుతోంది. అక్కడ ఓ మహిళ అరవై పేజీల బాంబుతో తచ్చాడుతోంది. బాంబులోంచి పొగ వెలువడుతోంది. ఎవరూ దాని నుంచి దృష్టి మరల్చలేకపోతున్నారు. అలాగని దాన్ని ముట్టుకునే సాహసం కూడా ఎవరూ చేయలేకపోతున్నారు. ఆ బాంబు పేలితే ఎవరెవరు బలి అవుతారోననేదే అందరిలో నెలకొన్న ఆందోళన. ఆ బాంబు అరుణాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కలిఖో పుల్ వదిలి వెళ్లిన సూసైడ్ నోట్. ఈటానగర్‌లోనైనా,

# కలిఖో బాంబు

**- యోగేంద్ర యాదవ్**

ఢిల్లీలోనైనా, ఇటు ప్రభుత్వాలూ అటు న్యాయవ్యవస్థా కలిఖో వదిలి వెళ్లిన సూసైడ్ నోట్‌ను మింగలేక, కక్కలేక ఇబ్బందులు పడుతున్నాయి.

కలిఖో పుల్ కాంగ్రెస్‌కు చెందినవాడు. 2016 ఫిబ్రవరిలో కాంగ్రెస్ సీఎం నబామ్ టూకీకి వ్యతిరేకంగా తిరుగుబాటు జెండా ఎత్తి కేంద్ర ప్రభుత్వ మద్దతుతో సీఎం అయ్యారు. సుప్రీంకోర్టు అరుణాచల్‌ప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలనను, కలిఖోను గద్దెనెక్కించే నిర్ణయాన్నీ రాజ్యాంగవిరుద్ధంగా ప్రకటించింది. తర్వాత కలిఖో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన శవం పైకప్పుకు వేలాడుతుండగా, నేలపై చుట్టూతా ఒక నోట్‌కు చెందిన పది ప్రతులు చెల్లాచెదురుగా పడివున్నాయి. 'మేరే విచార్' (నా భావనలు) అనే శీర్షికతో హిందీలో టైప్ చేసిన ఆ అరవై పేజీల నోట్‌లో ప్రతి పేజీపైనా మృతుడి సంతకం ఉంది. అంటే దీని విశ్వసనీయత నిర్వివాదాంశమన్నమాట (దీని పూర్తి పాఠం www.judicial reforms.orgలో ఉంది).

కలిఖో పేల్చిన ఈ బాంబులో అసలైన పేలుడు పదార్థం నడి మధ్యలో ఉంది. ప్రజాజీవితంలో పాతుకుపోయిన అవినీతిని బట్టబయలు చేస్తూ కలిఖో రాసిన భాగాల్లో ఉంది. అవన్నీ నిజమని భావించలేం. అయినా, రేషన్ బియ్యాన్ని అమ్ముకోవడం, నకిలీ బిల్లులు, డబుల్ బిల్లుల చెల్లింపులు, పట్టుబడినప్పుడు ఫైళ్లను మాయంచేయడం, వందలకోట్ల రూపాయలను దిగమింగడం వంటి వాటిపై ఆయన రాసిన కథనాలను మాత్రం ఉత్తుత్త మాటలుగా కొట్టిపారేయలేం.

కాంగ్రెస్‌లో రెండు దశాబ్దాల అనుభవంతో పుల్ చేసిన తుది నిర్ధారణ చేదు అనుభవంగానే ఉంది. 'కాంగ్రెస్ పార్టీ తన ఖజానాకు కావలసిన డబ్బులు పంపే వాళ్లకే పెద్ద పీట వేస్తుంది. వాళ్లనే నాయకుల్ని చేస్తుంది. అలా వారు ఖజానాలో నుంచి ప్రజల సొమ్మును కొంత దోచుకుని అధిష్టానానికి అందజేస్తూ ఉండాలి. అలా వారికి ఆదాయం సమకూర్చాలి'. ప్రస్తుత రాష్ట్రపతి సహా కాంగ్రెస్ బడా నేతలందరి పేర్లను ఉదహరిస్తూ ఎవరెవరికి ఎంతేసి డబ్బు ఇచ్చారో ఆ నోట్‌లో కలిఖో రాశారు.

కలిఖో చేసిన ఆరోపణల్లో అన్నింటికన్నా తీక్షణమైన భాగం న్యాయవ్యవస్థకు సంబంధించినది. ఆయన సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు విశ్రాంత న్యాయమూర్తులను, ఇద్దరు ప్రస్తుత న్యాయమూర్తులను పేర్కొంటూ వారిపై అవినీతి ఆరోపణలు చేశారు. రాష్ట్రానికి సంబంధించిన అనేక కేసులలో పెద్ద మొత్తంలో లంచాలు తీసుకుని పలు అవినీతి కేసుల్ని కొట్టివేశారన్నది ఈ ఆరోపణల సారాంశం. అంతేకాదు, అరుణాచల్‌ప్రదేశ్‌లో బర్తరఫ్ అయిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పున:స్థాపించే కేసులో ఇద్దరు న్యాయమూర్తుల బంధువుల ద్వారా తనను రూ. 86కోట్ల లంచం అడిగారని కూడా పుల్ పేర్కొన్నారు.

ఈ నలుగురు న్యాయమూర్తులలో ఇద్దరిపై ఇప్పటివరకూ ఎలాంటి మచ్చా లేదు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పుతో కలిఖో కక్ష పెంచుకుని ఆరోపణలకు పూనుకున్నారేమో. అయినా సరే, చట్టం మృతుడి చివరి వాంగ్మూలాన్ని లేదా సూసైడ్ నోట్‌ను సాక్ష్యంగా పరిగణిస్తుంది. పైగా ఇది దేశ అత్యున్నత న్యాయపీఠపు గౌరవానికి సంబంధించిన విషయం కూడా. కలిఖో ఆత్మహత్య తర్వాత సీబీఐతో విచారణ జరిపించాలని గవర్నర్ ఆదేశించినప్పటికీ విచారణ ఎందుకు జరగలేదు? కేవలం కాంగ్రెస్ నేతల పేర్లున్న ఈ నోట్‌పై విచారణ జరిపించడానికి బీజేపీ ప్రభుత్వం ఎందుకు తాత్సారం చేస్తోంది?

ఆత్మహత్య చేసుకోడానికి ముందు కలిఖో రాసిన నోట్‌పై సీబీఐతో విచారణ జరిపించాలని గవర్నర్ కేంద్రానికి సిఫార్సు చేశారు. సరిగ్గా ఆ సమయంలోనే ఢిల్లీలోని చాలామంది పాత్రికేయులకు బిర్లా-సహారాల వద్ద జప్తు చేసుకున్న దస్తావేజులు అందుబాటులోకి వచ్చాయి. బిర్లా-సహారా డాక్యుమెంట్లపై విచారణ జరిపించాలని ప్రశాంత్ భూషణ్ అక్టోబర్‌లో డిమాండ్ చేశారు. సరిగ్గా అదే సమయంలో ప్రభుత్వం ప్రధాన న్యాయమూర్తి నియామకం గురించి ఆలోచిస్తోంది. అదే సమయంలో ఢిల్లీలోని ఒక పెద్ద వకీలు ఇంటిపై సోదా జరగగా కోట్ల రూపాయల అక్రమ నగదు బైటపడింది. ఆ సొమ్ములో ఒక భాగం ఒక పెద్ద న్యాయమూర్తి కుమారుడిదని ఆ వకీలు చెప్పినట్టుగా ఆరోపణలు.

నవంబర్-డిసెంబర్ నెలల్లో సుప్రీంకోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. సుప్రీంకోర్టు ఒకనాటి తీర్పులనే పక్కనపెడుతూ, సహారా-బిర్లా కేసులో ఇలాంటి డైరీలపై, దస్తావేజులపై విచారణ జరపలేమనే ఒక కొత్త వ్యాఖ్య మొదలుపెట్టింది. జనవరిలో జస్టిస్ ఖేహార్ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ ప్రమాణం చేశారు. ఆ తర్వాత కొద్దిరోజులకు ఒక కొత్త బెంచ్ బిర్లా-సహారా కేసును కొట్టివేసింది. సుప్రీంకోర్టు, ప్రభుత్వాల మధ్య ప్రతిష్టంభన తొలగిపోనుందనే వార్తలూ రాసాగాయి.

ఈ ఘటనలన్నింటికీ పరస్పర సంబంధం లేకపోవచ్చు. ఇవన్నీ ఒక క్రమంలో జరగడం కేవలం యాదృచ్ఛికమే కావచ్చు కూడా. కొద్దిరోజుల క్రితమే ప్రధానమంత్రి తన వద్ద విపక్ష నేతలందరి చిట్టాలు ఉన్నాయని హెచ్చరిక స్వరంలో వ్యాఖ్యానించడం విదితమే. బహుశా ఆయన వద్ద మరి కొందరి మంది చిట్టాలు కూడా ఉండొచ్చు. కలిఖో పుల్ అనే బాంబు పట్ల ఇంత మౌనం వహించడం వెనుక ఇదే కారణం కావచ్చునేమో! ప్రస్తుతం బాంబు ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ కార్యాలయంలో ఉంది. సుప్రీంకోర్టు గతంలో వెలువరించిన ఒక తీర్పు ప్రకారం న్యాయమూర్తులపై విచారణకు ఆదేశాలు జారీ చేయడానికి ముందు ప్రధాన న్యాయమూర్తి సలహా తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ ఆరోపణ ప్రధాన న్యాయమూర్తి పైనే అయితే రాష్ట్రపతి ఇతర న్యాయమూర్తుల సలహా కోరతారు. అయితే ఇందులో ఈసారి ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్రపతి ఇరువురి పేర్లూ ఉన్నాయి. కాబట్టి కలిఖో పుల్ భార్య ఉపరాష్ట్రపతిని కలిసి తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. అయితే అక్కడైనా ఈ రహస్యంపై పరదా తొలగిపోతుందా లేక దీనికి బిరడా మరింతగా బిగించేస్తారా అన్నది వేచి చూడాల్సిందే.

(సాక్షి సౌజన్యంతో) ❍

# పౌర సేవల చట్టాన్ని ఆమోదించాలి

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతి విచ్చలవిడిగా సాగుతోందని, సొమ్ములు ముట్టచెబితేనే పనులు చేస్తున్నారని, ఈ రోజువారీ అవినీతి నుంచి ప్రజల్ని విముక్తి చేసేందుకు హక్కుగా 'పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ/రైట్ టూ సర్వీసెస్) చట్టాన్ని అమలు చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. చట్టంపై సానుకూలంగా స్పందించిన తెలంగాణ ప్రభుత్వానికి ఇప్పటికే లోక్‌సత్తా తయారుచేసిన ముసాయిదా చట్టాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పంపారని, అదే ముసాయిదాను ఏపీలోనూ చట్టంగా చేయాలని కోరింది.

విజయవాడలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ.. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే పౌర సేవల చట్టాన్ని ఆమోదించాలన్నారు. ఈ చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ అన్ని సేవలకూ సిటిజన్ ఛార్టర్లు ఉంటాయని, ప్రతి పనికీ గడువు, ఆ గడువులోగా పని పూర్తిచేయకపోతే దరఖాస్తుదారునికి జరిమానా ఉంటాయని అన్నారు.

తెలుగుదేశం పార్టీ వంశపారంపర్య కంపెనీలా మారిందని, పార్టీలో అనేకమంది అర్హులు ఉన్నా వారిని కాదని తన కుమారుడు లోకేష్‌ను చంద్రబాబు ప్రమోట్ చేస్తున్నారని బాబ్జీ అన్నారు. అది కూడా దొడ్డిదోవలో ప్రయత్నిస్తున్నారన్నారు. నల్లడబ్బు, వెనక ఎవరి దన్నూ లేకపోయినా సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికలలో నెగ్గగలిగే విధంగా సంస్కరణలకు లోక్‌సత్తా గట్టి పోరాటం చేస్తోందన్నారు. పారిశ్రామిక రాయితీలతో ఉపాధి, విద్య, ఆరోగ్యం, స్థానిక సమస్యలు, ఎ ంపిక చేసిన నియోజకవర్గాలలో లోక్‌సత్తా పార్టీని బలోపేతం చేసే ప్రణాళికపై కార్యవర్గ సమావేశంలో చర్చించామన్నారు. ❍

# డెల్టాల్లో రాజకీయ పూడిక



కుందేరు వద్ద నీటిపారుదలశాఖ అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్న జేపీ



తేలప్రోలు వద్ద రైతులతో మాట్లాడుతున్న జేపీ

జలాశయాలలో పూడికల వల్ల నీరు వృధా కాకుండా చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం మొదలుపెట్టిన కార్యక్రమం నత్తనడకన సాగుతున్నట్టే, నాగార్జునసాగర్, కృష్ణా డెల్టాలలో ఆధునీకరణ పదేళ్ల కాలంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టు సాగుతోంది. అవినీతి, అసమర్థత, ఆశ్రితపక్షపాతం ఈ పనుల్లో రాజ్యమేలుతున్నాయని 2012లో రైతులతో కలిసి ఈ పనుల్ని, కాలువల్ని కొన్ని కిలోమీటర్ల మేర సందర్శించిన అనంతరం లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రభుత్వాన్ని ఎండగట్టారు. అధికారులు, స్థానిక రైతుల నుంచి కూడా వివరాల్ని తీసుకున్న జేపీ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ల కోసం కాకుండా రైతుల, ఆ ప్రాంతవాసుల ప్రయోజనాలకనుగుణంగా ఆధునీకరణ డిజైన్లు ఉండాలని స్పష్టం చేశారు. పనుల్ని పారదర్శకంగా, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసే ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు.

'రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, లాలూచీ'.. మీకు తెలియనిదేముంది! అని ఇప్పటికీ అధికారులు పనుల్లో జాప్యాన్ని దాటవేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ ఉన్న 4,900 భారీ ఆనకట్టల్లో పూడికల వల్ల నిల్వ సామర్థ్యం తగ్గటం, నీరు వృధా అవటం ఒక ఎత్తయితే, అక్కడ నుంచి పంపిణీ అవుతున్న నీటిలో సేద్యవాడకంలో 60శాతం, నగరాలకు పంపిణీలో 50శాతం వృధా అవటం మరోఎత్తని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమ (యూఎన్‌డీపీ) నివేదిక చెబుతోంది. ఏటా నీరు వృధాతో నీటి వివాదాలు పెరుగుతున్నా సరే, డెల్టా పనుల్లో పురోగమనం పట్ల ఉదాసీనత తొలగలేదు.

రాజకీయ గ్రహణం కారణంగానే ప్రధానంగా నాగార్జునసాగర్, కృష్ణా డెల్టాల ఆధునీకరణ పనులు దశాబ్దకాలంగా ముందుకు సాగటం లేదు. మట్టి పనులతోనే ఏటా సరిపెడుతున్నారు. దీంతో ఈ రెండు ప్రాంతాలలో ప్రతి ఏటా ఆయకట్టుకు సాగునీరు సక్రమంగా అందకపోగా వరద ముంపుతో ఊళ్లు పిల్ల కాలవల్లా తయారవుతున్నాయి. కొందరు నేతల ప్రత్యక్ష, పరోక్ష భాగస్వామ్య సంస్థలే ఆధునీకరణ పనులు చేపట్టటంతో అధికారులు ప్రశ్నించే సాహసం చేయలేకపోతున్నారు. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాల ఆధునీకరణకు ప్రపంచబ్యాంకు పదేళ్ల క్రితం 5వేల కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఇందులో గుంటూరు జిల్లా పశ్చిమ డెల్టాకు రూ.2206 కోట్లు కేటాయించారు. అయితే దీర్ఘకాలిక ప్రాతిపదికన పనులు నిర్వహించేందుకు కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాకపోవటంతో ప్యాకేజీలుగా

వర్గీకరించారు. ఈ మేరకు కృష్ణా పశ్చిమ డెల్టాను ఇరిగేషన్ పరిధిలో 11 ప్యాకేజీలు, డ్రైనేజీ శాఖ పరిధిలో మరో 8 ప్యాకేజీలుగా పనులు చేపట్టేందుకు కొన్ని కాంట్రాక్టు సంస్థలు ముందుకొచ్చాయి. ఇందులో మాజీ ఎంపీ, ప్రస్తుత బీజేపీ నేత కావూరి సాంబశివరావుకు చెందిన ప్రోగ్రెసివ్ కన్‌స్ట్రక్షన్స్, అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలకు చెందిన రాంకీ ఫౌండేషన్, హైదరాబాద్‌కు చెందిన మెసర్స్ ఎస్‌ఈడబ్ల్యు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ సంస్థలు పనులు చేపట్టాయి. ఆధునీకరణ పనుల్లో మితిమీరిన జాప్యం చేస్తున్నాయి. అయినా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకూ నివేదికను పరిశీలిస్తే, పశ్చిమ డెల్టా పరిధిలో 8 ప్యాకేజీలకు రూ. 835.31 కోట్లకుగాను రూ. 363.01 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయి. ఇంకా రూ. 472కోట్ల మేర పనులు ఈ ప్యాకేజీ కింద పూర్తి కావాల్సి ఉంది. మిగిలిన ప్యాకేజీలకు సంబంధించి పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. వీటికి సవరించిన అంచనాలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ఓగ్ని తుపాను సందర్భంగా కృష్ణా డెల్టాకు అపారనష్టం జరిగింది. ఇరిగేషన్, డ్రైనేజీ కాలువలు ఏకమై ఊళ్లను ముంచెత్తాయి. ఈ నేపథ్యంలో ఆధునీకరణ అవసరం తెర పైకి వచ్చింది. అప్పట్లో ప్రభుత్వం రూ. 5వేల కోట్ల అంచనాలతో ప్రపంచబ్యాంక్‌కు నివేదిక అందచేసింది. ఈ మేరకు రుణం మంజూరైంది. అప్పటి నుంచి ఇప్పటివరకూ డెల్టా పనులు పూర్తి కాలేదు. రాజధాని ముంపునకు కారణమైన కొండవీటి వాగు డైవర్షన్ స్కీము నీటిని కూడా కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువ మీదగా దిగువకు వదిలే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అటు ఆధునీకరణకు నోచుకోక, ఇటు అదనంగా వరదనీరు తోడైతే, పశ్చిమ డెల్టా భవితవ్యం ప్రశ్నార్థకం కానుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టా పరిధిలో 13.5లక్షల హెక్టార్ల భూమి సాగవుతోంది. పట్టిసీమ పనిలో భాగంగా కృష్ణా జిల్లా బుడమేరు పనులు కొన్ని చేశారు. మిగిలిన ప్రధాన కాలువలు పూర్తి కాలేదు. పశ్చిమ డెల్టాలో 50శాతం పనులు మిగిలి ఉన్నాయి. నాలుగేళ్ల దీర్ఘకాలిక ప్రాతిపదికన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించారు. పనుల్లో జాప్యం జరగటంతో ఏటా అంచనాలు పెరుగుతున్నాయి. సకాలంలో పూర్తిచేయని కంపెనీలను బ్లాక్‌లిస్టులో పెడతామని ఎప్పటినుంచో ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో హైలెవెల్ కమిటీ తిరిగి పై సంస్థలకే కాంట్రాక్టును పొడిగించటం గమనార్హం.

ఇదిలా వుంటే, నాగార్జునసాగర్ డెల్టా ఆధునీకరణలో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారుల పొంతన లేని లెక్కలతో పనులు సైతం ముందుకు సాగటం లేదు. వీటిపై వివరణ కోరుతుంటే రాజకీయంగా ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇవన్నీ మీకు తెలియనివికావని సెలవిస్తున్నారు. వేరే కాంట్రాక్టర్లను పెట్టే ప్రయత్నం చేస్తున్నామని చెబుతున్నారు.

గత ఏడాది ఖరీఫ్, రబీ పంటలకు సాగర్ కుడికాలువ పరిధిలోని రైతులు నోచుకోలేదు. ఒకరకంగా ఇక్కడ అనధికార క్రాప్‌హాలిడేను ప్రకటిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సాగర్ ఆధునీకరణకు ప్రపంచ బ్యాంక్ రూ. 2832.7 కోట్లు మంజూరు చేసింది. గుంటూరు జిల్లాలో ప్రధాన, బ్రాంచి కాలువల ఆధునీకరణకు రూ. 374కోట్లు కేటాయించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, సాగునీటి సంఘాలకు మరో రూ. 610కోట్ల మేర పనులను అప్పగించారు. సాగర్ కుడికాలువ పరిధిలో 8, 9 మినహా 10, 11, 12 ప్యాకేజీల పనులు ఇప్పుడే ప్రారంభమైనట్టు అధికారులు చెబుతున్నారు. ప్యాకేజీ-19 కింద బెల్లంకొండ - జూలకల్లు బ్రాంచ్ కెనాల్, 20 పరిధిలోని గుంటూరు బ్రాంచ్ కెనాల్, 21వ ప్యాకేజీగా అద్దంకి బ్రాంచ్ కెనాల్ మట్టి పనులు జరుగుతున్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 30 ప్యాకేజీల పనులు కూడా ఇంకా పూర్తి కాలేదు. ప్రధాన కాలువ ప్యాకేజీ కింద ఇప్పటివరకు రూ. 395.98కోట్లు ఖర్చుకాగా, డీసీల పరిధిలో రూ. 214.9కోట్లు వెచ్చించారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి మరో 30 ప్యాకేజీ పనులు పురోగతిలో ఉన్నాయని, వీటికి రూ. 189.1కోట్లు నిధులు కేటాయించినట్టు అధికారులు లెక్కలు తేల్చారు. ఈ మొత్తం ప్యాకేజీ పనుల్లో ఏ ఒక్కటీ పూర్తికాలేదన్నది బహిరంగ రహస్యం. సాగర్ కుడికాలువ ఆధునీకరణ పనులను ఖమ్మం ఎంపీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి (వైకాపా నుంచి టీఆర్‌ఎస్‌లోకి జంప్ అయ్యారు)కి చెందిన సంస్థతోపాటు నల్గొండ జిల్లా కాంట్రాక్టు సంస్థలు నిర్వహిస్తున్నాయి. గత ఏడాది పుష్కరాల వల్ల ఆధునీకరణ పనులు జరగలేదని అధికారులు చెబుతున్నారు. దశాబ్దకాలంగా ఎందుకు జాప్యం జరిగిందనే విషయంపై సమగ్ర సమాచారం లేదు. ఇప్పటికైనా కృష్ణా డెల్టా, సాగర్ ఆధునీకరణ పనులపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే భవిష్యత్తులో అనర్థాలు తప్పవనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ❍

# ఏటా ఒక్కో పౌరునిపై రూ.4207 ఖర్చు చేస్తున్నా.. నగరపాలనలో హైదరాబాద్ ఫెయిల్!

హైదరాబాద్ ప్రపంచస్థాయి నగరం. మిలియనీర్లు, అధునాతన భవనాల లెక్క ఏటా పెరుగుతూనే ఉంటుంది. అయితే ప్రజల రోజువారీ అవసరాలు తీర్చే నగర పాలనలో మాత్రం ఇంకా మన నగరానిది అథమస్థాయే. సర్వేల దాకా వెళ్లనక్కర్లా, రోజూ నగర రోడ్ల మీద కాసేపు వెళ్లి వచ్చేవారు ఈ నగరాన్ని పీడిస్తున్న రాజకీయ, పాలనా గ్రహణాల్ని, డివిజన్ స్థాయి అవినీతి దందాల్ని ఇట్టే పట్టేయొచ్చు. నగర పాలక సంస్థ బడ్జెట్ నుంచి ప్రతి పౌరుని పేరు మీద రూ.1000 నేరుగా వార్డు స్థాయికి కేటాయించి, అక్కడ ప్రజలు ఎన్నుకున్న వార్డు కమిటీలు (ఎన్నికైనవి), కార్పొరేటర్ కలసి రోజువారీ సమస్యలను పరిష్కరించుకునే ఏర్పాటు చేస్తే నగరంలోని చాలా సాధారణ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కానీ జనం చేతికి అధికారం ఇవ్వటాన్ని మాత్రం ఏ పరిస్థితుల్లోనూ సహించలేని నేతలు, అధికారులు ఈ తలసరి కేటాయింపు చేయకుండా జనానికి నరకం చూపుతున్నారు. ప్రతి చిన్నపనికీ తమ చుట్టూ తిప్పుకుంటూ ఓట్లు, మామూళ్లు దండుకుంటున్నారు. హైటెక్ సిటీగా హైదరాబాద్‌ని మార్చామని ఇప్పటికీ డబ్బాలు కొట్టుకునే పాత పాలకుల హయాంలోనేకాదు, ప్రత్యేక రాష్ట్రంలోనూ నగర పాలన తీరు మారలా. 2009లో, 2016లో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో లోక్‌సత్తా ఈ 'తలసరి రూ.1000 కేటాయింపు - వార్డు ప్రభుత్వం' నినాదంతోనే పోటీ చేసింది. కానీ తగినన్ని ఓట్లు రాకపోవటంతో ఇంకా ఆ ఎజెండాకు తగిన బలం రాలేదు. జనాగ్రహ సెంటర్ ఫర్ సిటిజన్‌షిప్ అండ్ డెమోక్రసీ సంస్థ ఇటీవల విడుదల చేసిన సర్వేలో తలసరి ఖర్చు కోణాన్ని ప్రత్యేకించి ప్రస్తావించింది. 2016లో హైదరాబాద్‌లోని ఒక్కో పౌరునిపై ఏటా రూ.4207 ఖర్చు చేసినట్లు తెలిపింది. 2016 అనుభవాల్ని ఇంకా మనం మర్చిపోలేదు కాబట్టి.. ఇంత డబ్బు మన మీద ఖర్చు చేస్తే మనకు లభించిన సౌకర్యాలు ఎలా ఉన్నాయో ఒక్కసారి బేరీజు వేసుకోవచ్చు. అధ్వాన్న రోడ్లు, పొద్దున వేసిన రోడ్డు సాయంత్రానికి కొట్టుకుపోవటం వంటి భయంకర పరిస్థితులు, చేదు అనుభవాలు కళ్ల ముందు మెదలక మానవు. ఈ డబ్బుల్లో లోక్‌సత్తా చెప్పినట్టు, నేరుగా బస్తీలకు రూ.1000 కేటాయించి ఉంటే? అద్భుతాల్ని కాకపోయినా, ఉన్న పరిస్థితి కంటే చాలా బాగుచేసుకునేవాళ్లం. ఎన్నికలప్పుడు తప్ప మనకు ఏ పవర్స్ూ

## వికేంద్రీకరణ పరిష్కారం చూపుతున్న తార్నాకవాసుల సంక్షేమ సంఘం



ప్రజల రోజువారీ జీవితాల్లో 80శాతం సేవలు సక్రమంగా అందాలంటే నగరాల్లో, పట్టణాల్లో నిధుల్ని, అధికారాల్ని వార్డు స్థాయికి, వీలైతే కాలనీ స్థాయికి కూడా వికేంద్రీకరించాలని హైదరాబాద్ తార్నాక అనుభవం రుజువు చేస్తోంది. తార్నాక రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టాండింగ్ కమిటీ (ఎస్‌సీవోటీఆర్‌డబ్ల్యుఏ) చేసిన ప్రతి కార్యక్రమం అక్కడి ప్రజల్లో ఎక్కువమందిని భాగస్వాముల్ని చేస్తూ, వారి శక్తిసామర్థ్యాలను వెలికితీస్తూ, అందరికీ లబ్ధి చేకూరుస్తోంది. సమస్యలను ఎవరో పైవారికి ఏకరువు పెట్టటం, పరిష్కారాలపై గందరగోళం, జాప్యాలు వంటివేమీ లేకుండా చాలా సందర్భాల్లో అక్కడివారు అవినీతికి ఆస్కారం లేకుండా, వేగంగా తమ పనుల్ని చేసుకోగలుగుతున్నారు. "ఓటుకు-తమ ప్రయోజనాలకు మధ్య సంబంధాన్ని ప్రజలు అర్థం చేసుకునేలా చేయటం, అధికారులలో జవాబుదారీతనం పెంచటం, తక్కువ రిస్కుతో కొత్త ఆలోచనల్ని అమలుచేయటం, ఇతర ప్రాంతాలకూ ఆదర్శంగా ఉండే పరిష్కారాలను అందించటం, నాయకత్వాన్ని పెంపొందించటం" - అధికార వికేంద్రీకరణ వల్ల కలిగే ఈ ఐదు ప్రయోజనాలూ తార్నాక అసోసియేషన్ కార్యక్షేత్రంలో మనకు కనిపిస్తాయి. హైదరాబాద్ కార్పొరేషన్‌లో వార్డు కమిటీల వ్యవస్థను ప్రక్షాళన చేసి, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు వాటిలో చోటు కల్పించి చట్టం పరిధిలోనే వాటికి స్వేచ్ఛనిస్తే.. మన నగర పాలన ప్రపంచస్థాయిని అందుకోవటానికి మంచి పునాది ఏర్పడుతుంది. ఇతర స్థానిక ప్రభుత్వాలకూ స్ఫూర్తినిస్తుంది.

ఉండవు అనుకునే దశ నుంచి.. స్థానికంగా నిధులు, అధికారాలతో సామర్థ్యాల్ని వినియోగించుకునే అవకాశాన్నిస్తే ప్రజలు క్రమంగా అద్భుతాల్ని కూడా సాధిస్తారని పలు అనుభవాలు రుజువు చేస్తున్నాయి.

పట్టణ చట్టాలు, విధానాలు, నిబంధనలు, ప్రభుత్వ నివేదికలు, బడ్జెట్‌లను పరిగణలోకి తీసుకుని రూపొందించిన జనాగ్రహ నివేదికలో మొత్తం అన్ని విభాగాల్లో కలిపి న్యూయార్క్, లండన్ నగరాలకు 9.9, 9.4 పాయింట్లు వస్తే, హైదరాబాద్‌కి కేవలం 3.9 పాయింట్లు వచ్చాయి. మనదేశంలో ప్రథమస్థానం సాధించిన తిరువనంతపురానికి వచ్చిన పాయింట్లు కాస్త ఎక్కువగా 4.4 మేర ఉన్నాయి. ప్రపంచస్థాయి నగరాలదాకా పోకుండా భారతీయ నగరాలతో పోల్చినా కీలకమైన జన సాధికారతలో హైదరాబాద్ ర్యాంకింగ్ పేలవంగా ఉంది. రాజకీయ ప్రాతినిధ్యం, సాధికారతలో 21 స్వదేశీ నగరాలలో హైదరాబాద్ 19వ స్థానంలో ఉంది. సొంత వనరుల ద్వారా హైదరాబాద్ 77శాతం నిధుల్ని సమీకరించుకుంటోందని, ప్రజలకు సేవలదించటంలో కార్పొరేషన్ ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహిస్తోందని నివేదిక తెలిపినా, ఏ చిన్న కార్యం జరిగినా నాయకులు జనం మధ్య ప్రత్యక్షమవుతున్నా.. కీలకమైన విధాన పరిష్కారాలు లేకపోవటంతో చివరకు హైదరాబాద్ ప్రజలకు నిరాశే మిగులుతోంది. తిరువనంతపురం, పూనె, కోల్‌కతా, ముంబయిల్లో స్థానిక పాలన కాస్త మెరుగ్గా ఉందని, హైదరాబాద్ సహా దేశంలోని మిగిలిన అన్ని నగరాల్లో మునిసిపల్ పాలన విఫలమైనట్టేనని జనాగ్రహ అభిప్రాయపడింది. ఈ సర్వేలోకి ఆంధ్రప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాల్లోని నగరాలను పరిగణలోకి తీసుకోలేదు. వచ్చే ఏడాది నుంచి వాటిని చేరుస్తారు.

పురపాలక చట్టాలను సవరించాల్సి ఉందని, నగరాలు, పట్టణాల్లోని స్థానిక ప్రభుత్వాలు సుసంపన్నం అయ్యేందుకు జనాగ్రహ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి వెంకయ్య నాయుడు చెప్పటం కొసమెరుపు. ❍

# వార్డు కమిటీలు వేయాలి - ప్రజల భాగస్వామ్యం పెంచాలి




నగర పాలనలో ప్రజల భాగస్వామ్యం ఉండాలని 2008లో తీసుకొచ్చిన 'చట్టం 7'లో స్పష్టంగా పేర్కొన్నవుటికీ హైదరాబాద్ కార్పొరేషన్‌లో అమలుకు నోచుకోవడంలేదని సుపరిపాలన వేదిక వ్యాఖ్యానించింది. వేదిక అధ్యక్షుడు జస్టిస్ రెడ్డప్పరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ ఎన్నికల అనంతరం మూడు నెలల్లో నగర పాలక సంస్థలో వార్డు కమిటీలు వేయాల్సి ఉంది. కానీ అలాంటి ప్రయత్నం ఏదీ జరిగినట్టు కనిపించటం లేదన్నారు. వార్డు కమిటీలు ఏర్పాటు చేయకపోవడం వల్ల పరిస్థితులు అధ్వాన్నంగా మారాయన్నారు. కార్యదర్శి ఎం. పద్మనాభరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వార్డులో 10కి మించకుండా స్వచ్ఛంద సేవాసంస్థల సభ్యులు ఉండాలని చట్టం నిర్ణయించిందన్నారు. అయితే ఈ వార్డు కమిటీ సభ్యులను పాలకమండలి నామినేట్ చేస్తుందన్నారు. ఇందులో సేవాభావం ఉన్న పౌరులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ సంఘాలు, సామాజిక, సాంస్కృతిక సంస్థలవారికీ భాగస్వామ్యం కల్పించాలని ఆ చట్టం చెప్పిందన్నారు. ఈ వార్డు కమిటీ సభ్యులు ప్రతి మూడు నెలలకోసారి సమావేశమై స్థానిక సమస్యలపై చర్చించి, అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకునే అధికారం ఉంటుందని పేర్కొన్నారు. కానీ గత కమిటీలను పరిశీలిస్తే ఎమ్మెల్యే, కార్పొరేటర్ల బంధువులు, పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేస్తున్నట్టు తేలిందన్నారు. ఇప్పటికైనా చట్టం 7ను పకడ్బందీగా అమలుచేయాలని వేదిక కోరింది. వార్డు కమిటీల్లో రాజకీయ జోక్యం తగ్గించి, బాధ్యత గల పౌరులకు తగిన విధంగా అవకాశాలు కల్పించాలని డా॥ రావు చెలికాని ప్రభుత్వాన్ని కోరారు. ❍

# మార్పు తెచ్చే నాయకులు కావాలిప్పుడు

అవకాశాల కోసం ఉత్సాహంగా, ఎన్నో ఆశలతో కోట్లాదిమంది యువత ఎదురుచూస్తున్న మనదేశంలో వారి ఆశలకు తగ్గ మార్పు తెచ్చే నాయకులు ఇప్పుడు కావాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడేళ్ల పాలన ముగిసినా ప్రజల జీవనవిధానంలో ఎలాంటి మార్పూ రాలేదని, దీనిపై చంద్రబాబు ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. దేశంలో చూస్తే, పెద్ద నోట్లు రద్దు చేసినా అవినీతి తగ్గలేదని, కొన్ని విభాగాలలో మరింత పెరిగిందన్నారు. ఏటీఎంలలో ప్రజలకు డబ్బు సరిపడా అందుబాటులో లేదన్నారు. నోట్ల రద్దుతో అవినీతి పోతుందన్న ఆశతోనే ప్రజలు ఎన్ని ఇబ్బందులచ్చినా ప్రభుత్వ అసమర్థత, అవగాహనారాహిత్యంపై తిరగబడలేదని అన్నారు. కనీసం 1000మంది అవినీతి అధికారులను ఇంటికి పంపాలని, ప్రధానికి ఆ అధికారం ఉందన్నారు. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు ఆ పని చేయాలన్నారు. ఇలాంటి చర్యలతోపాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు గడువులోగా పనిచేసి పెట్టటం, లేకుంటే పరిహారం చెల్లించటం వంటి ఏర్పాట్లతో 'పౌర సేవల' చట్టాన్ని తీసుకురావాలన్నారు.

లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పార్టీ నేతలు వేణుగోపాల్, ఆర్. ఝాన్సీ, ఎంఎస్ఎం మూర్తి, రాజ్ వర్మ, రామానాయుడు, వడ్డి హరిగణేష్, లోక్‌సత్తా బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వి.వి రమణమూర్తి తదితరులతో కలిసి విశాఖపట్నం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మీడియాతో జేపీ మాట్లాడారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని ఒక్కటి కూడా నెరవేర్చకుండా, జనం జీవితాల్ని ఏమాత్రం బాగుచేయకుండా బండి లాగిద్దామనుకుంటే ప్రజల్లో సహనం నశించి తిరగబడే రోజు వస్తుందని జేపీ అన్నారు. సాంప్రదాయ రాజకీయ పార్టీల నుంచి ప్రజల కోసం గొంతు విప్పే నాయకులు రావాలన్నారు. ఎటువంటి అధికారం లేకపోయినా, ఎమ్మెల్సీ పదవుల కోసం పార్టీలు భయంకరంగా పోటీపడటం, మంత్రులు, ఎమ్మెల్యేలు కుస్తీపట్టటం హాస్యాస్పదమన్నారు. ఇచ్చిన హామీల్ని నెరవేర్చే ప్రయత్నం చేయకుండా ప్రజల పన్నుల డబ్బుతో పాలకులు విలాసాలు, ఆర్భాటాలతో కాలక్షేపం చేస్తుండటం వల్ల అన్ని వనరులూ ఉన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుందన్నారు. కేంద్రం ఆశించిన సాయం చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం సరైనరీతిలో స్పందించటం లేదన్నారు. ఒక్కో పాఠశాల విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ.44,000 ఖర్చు చేస్తున్నా, ప్రమాణాలున్న చదువు రావటం లేదన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందరికీ అందించే చర్యల్ని ప్రభుత్వం చేపట్టాలన్నారు. రైతులకు వ్యవసాయం లాభసాటిగా మారాలంటే గిడ్డంగుల్ని నిర్మించటంతోపాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఈ రంగంలోకి పెద్దఎత్తున వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 700 ఇంజినీరింగ్ కళాశాలలుంటే, వాటిలో 100మినహా మిగిలినవాటిని మూసివేసినా నష్టంలేదన్నారు. వాటిలో విద్యాప్రమాణాలు అంత అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు. యువతలో నైపుణ్యాల్ని పెంచి ఉపాధి కల్పించటానికి ప్రభుత్వం చేయాల్సింది చాలా ఉందని జేపీ అన్నారు. ❍


## FORM IV

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of its publication | : | Fortnightly |
| 3. Printer's Name | : | Dr. Jaya Prakash Narayan |
| Nationality | : | Indian |
| Address | : | Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P) |
| 4. Publisher's Name | : | Dr. Jaya Prakash Narayan |
| Nationality | : | Indian |
| Address | : | Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P) |
| 5. Editor's Name | : | Dr. Jaya Prakash Narayan |
| Nationality | : | Indian |
| Address | : | Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P) |
| 6. Name and address of individual who own the news paper | : | Dr. Jaya Prakash Narayan, Indian, Flot No. B-504, Pasha Court, Somajiguda, Hyderabad-500082(A.P) |
| and partners or shareholders holding More than one per cent of the total capital | | NA |

I, Dr. Jaya Prakash Narayan hereby declare that the particulars given above are true to the best of my knownledge and belief

Date : 16 March 2017

(Sd) (Jaya Prakash Narayan)
Signature of the Publisher

# పుట్టుకతో వివక్ష కొనసాగింపు – 'చెత్త చదువుల' పాలకులదే ఈ తప్పు






మనందరం తలదించుకునేలా పుట్టుకను బట్టే కోట్లాదిమంది బిడ్డల భవిష్యత్తు నిర్ణయమైపోతుండటానికి కారణం చెత్త చదువులేనని, అయినా కేంద్రంలో, రాష్ట్రంలోని మన పాలకులు అజ్ఞానంతో, మూర్ఖత్వంతో అవే విధానాలను కొనసాగిస్తున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.44,000 ఖర్చు చేస్తున్నా విద్యలో రాష్ట్రం వెనకబడి ఉందన్నారు. దేశంలో అత్యధిక సంఖ్యాక ప్రజలకు విద్యను నిర్లక్ష్యం చేసిన జాతి పలుచనవుతుందని, సుస్థిరాభివృద్ధిని సాధించలేదని అన్నారు. పుట్టుకతో వివక్షకు రాజకీయ నాయకులది తప్పు కాకపోయినా, దాన్ని సరిచేయాల్సిన బాధ్యత మాత్రం ప్రధానంగా రాజకీయ వ్యవస్థదేనన్నారు. పాలకులు చెత్త చదువులకవిధానాలకు స్వస్తి పలకాలన్నారు. పుట్టుకను బట్టి కాకుండా తనలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకుని ప్రతిభతో ప్రతి బిడ్డా ఎదిగేందుకు అవకాశాలు కల్పించే నాణ్యమైన విద్యావిధానాన్ని అమలుచేయాలన్నారు.

తూర్పు గోదావరి జిల్లా పలు 'విద్యా' కార్యక్రమాల్లో జేపీ పాల్గన్నారు. ఐ.పోలవరం మండలంలోని ఎదుర్లంకలో లోక్‌సత్తా పార్టీ ఎంపీటీసీ ముదునూరు రాజ్ వర్మ చొరవతో గ్రామస్తుల వితరణతో నిర్మించిన డిజిటల్ క్లాస్ రూంను జేపీ సందర్శించారు. అనంతరం 'గ్రామాభివృద్ధి – యువ నాయకత్వం'పై జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గన్నారు. తర్వాత లోక్‌సత్తా ఉద్యమ సంస్థ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి మాచిరాజు ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్‌టీయూ ప్రాంగణంలో జరిగిన 'క్రియ' పిల్లల పండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 5,000మంది పిల్లలు పాల్గొన్న ఈ రాష్ట్ర స్థాయి అంతర్ పాఠశాలల పోటీలో దేశం నలుమూలల్నుంచి వచ్చిన వృత్తి నిపుణులు, ఐఐటీ విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా బాధ్యతలు నిర్వహించారు.

ఈ విద్యా కార్యక్రమాల్లో జేపీ మాట్లాడుతూ, మనదేశంలోని విద్యార్థులు ఎంతో కష్టపడి చదువుతున్నా, తల్లిదండ్రులు పొలాలు, ఇతర ఆస్తులు తాకట్టుపెట్టి చదివిస్తున్నా ప్రయోజనం ఉండకపోవటం దురదృష్టకరమన్నారు. మన చదువులు పనికిరానివని తెలిసినా మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూర్ఖత్వంలో, అజ్ఞానంలో పట్టించుకోవటం లేదన్నారు. ప్రభుత్వాలు ప్రధానంగా విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన చుట్టూనే తిరగాల్సి ఉన్నా వాటినే తెలుగు రాష్ట్రాల్లో, మనదేశంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నాణ్యమైన విద్య ద్వారా సంపద, పరిజ్ఞానం, సంస్కారం పెరుగుతుందని ప్రపంచంలో అన్ని దేశాలకూ తెలిసినా భారత్‌కు మాత్రం తెలియటం లేదన్నారు. ప్రశ్నించే తత్వం విద్యతోనే సాధ్యమని, ప్రతిభను బట్టి పిల్లలకు గుర్తింపు రావాలిగానీ పుట్టుకను బట్టి కాదన్నారు. పుట్టుకతో వివక్షను నిర్మూలించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఆత్మవిశ్వాసం గలవారిగా పెంచాలన్నారు. సంపదను సృష్టించటాన్ని పిల్లలకు నేర్పాలని సూచించారు. సంపదంటే నగదు మాత్రమే కాదని, సమాజంలో కోట్లాదిమందికి అవసరమైన వస్తువుల్ని, సేవల్ని ఉత్పత్తి చేయటమని అన్నారు. ఆత్మగౌరవంతో కూడిన సమాజం తయారుకావాలని, విద్యార్థులు సాంకేతికాభివృద్ధిని అందిపుచ్చుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. సైన్స్, టెక్నాలజీల్లోనే




కాకుండా.. సమాజానికి కీలకమైన రాజకీయాలు, పాలన తదితర రంగాల్లో కూడా ఎప్పటికప్పుడు నూతన పోకడల్ని అందించగలిగే పరిశోధకులుగా కూడా స్థిరపడగలగాలన్నారు.

ప్రజలు రాజకీయాలకతీతంగా తమ ఊరు బాగోగుల్ని పట్టించుకుంటూ విద్యావ్యవస్థలో దుస్థితిని మార్చాలని జేపీ విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు, పెళ్లిళ్లు, సంబరాలకే మన సొమ్మంతా ఖర్చు చేస్తున్నామని, డబ్బును సద్వినియోగం చేసుకునే విజ్ఞతను ప్రదర్శించాలన్నారు. ప్రతి ఒక్కరూ తాము చదువుకున్న పాఠశాలను, ఊరును అభివృద్ధి చేసేందుకు కృషి చేసి నవసమాజాన్ని స్థాపించి తరువాతి తరాలకు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ దిశగా కృషి చేస్తున్న 'క్రియ' ఫౌండేషన్‌ను అభినందించారు.



ప్రజాస్వామ్యంలో ఓట్ల కొనుగోలు పరిపాటిగా మారిందని, ఓట్ల చుట్టూ నల్లధనం, అవినీతి వల్ల ప్రభుత్వోద్యోగులు లంచాలు తీసుకుంటున్నా పాలకులు భాగస్వాముల్లా వ్యవహరిస్తున్నారని జేపీ అన్నారు. సరైన చదువు లేకపోవటానికి తోడు.. అధికార పిచ్చి, కుల రాజకీయాలు మనల్ని పీడిస్తున్నాయన్నారు. పంచాయతీ సర్పంచ్ పదవికి కూడా రూ.50లక్షలు ఎందుకు ఖర్చు చేస్తున్నారో అర్థం కాదన్నారు. సినిమా యాక్టర్ నుంచి ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రి వరకూ కుల రాజకీయాలు పీడిస్తున్నాయన్నారు. మన గ్రామం నుంచి ప్రభుత్వాలకు పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బులో కొంత భాగం మన వద్దే అవసరాలకు కేటాయించాలని డిమాండ్ చేయాలన్నారు. పేదరికం, కుల వివక్ష, అంటరానితనం పోయి ప్రజలు స్థానికంగా తమ రోజువారీ పనులను సాధికారతతో నిర్వహించుకోగలిగినప్పుడే నిజమైన మార్పు సాధ్యమన్నారు.

కోనసీమ సంస్కృతిని ఈ సందర్భంగా జేపీ ప్రస్తుతించారు. ఘనాపాటిలు, పండితులు, విద్యావేత్తలు, నాగరికత, సంస్కారం ఉన్నవారికి ఈ ప్రాంతం నెలవని అన్నారు.

ఎదుర్లంక ప్రాథమికోన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూంలో, క్రియ పండుగలో పిల్లలతో జేపీ ముచ్చటించి పలు సూచనలనిచ్చారు. పోటీల్లో గెలిచినవారికి బహుమతులను అందించి వెన్నుతట్టారు.

కార్యక్రమాల్లో క్రియ ఫౌండేషన్ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, పదాల ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సూర్యప్రకాష్, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, వెంకట రమణ, బీర సత్యనారాయణ, బాల ఆనందకుమార్, పలివెల వెంకటేశ్వరరావు, ఏపీపీఎస్సీ ఛైర్మన్ పి. ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ❍

# కోట్లమందిని కాపాడిన టీకాలు

పోలియో, పొంగు, కుక్కకాటు, హెపటైటిస్-ఎ వంటి వ్యాధుల నుంచి ప్రపంచవ్యాప్తంగా కోటిమందికిపైగా ప్రజల్ని వ్యాక్సిన్లు కాపాడాయి. సుమారు నాలుగు కోట్ల యాభై లక్షలమంది ఈ వ్యాధుల బారినపడకుండా నివారించినట్టు తాజా అధ్యయనం వెల్లడించింది. 1962లో సెల్‌స్టెయిన్ డబ్ల్యుఐ-38 (కణంలో ఒకరకం)ను రూపొందించిన నేపథ్యంలో ఎన్ని ప్రాణాలను కాపాడగలిగామనే అంశంపై పరిశోధకులు ప్రధానంగా దృష్టి సారించారు. ❍



# ‘చట్టబద్ధ పాలన’ నాగరికతకు చిహ్నం, విద్య, వైద్యం కూడా హక్కుగా పౌరసేవల్లో భాగం కావాలి: జేపీ

అవినీతి అంతటా ప్రబలుతోందని, ఇందుకు మన ఇళ్లు కూడా మినహాయింపు కాదని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అయితే ఇంట్లో అవినీతి వల్ల నష్టం పరిమితం కాగా, సమాజంలో అవినీతి వల్ల అందరికీ భారీ నష్టం జరుగుతుందన్నారు. అందుకే మంచి జీవితాన్ని, భవిష్యత్తును కోరుకునేవారంతా అవినీతి అంతానికి తగిన వ్యవస్థ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. చట్టబద్ధ పాలన మాత్రమే నాగరికతకు చిహ్నమని, చట్టాలు రూపొందించి అమలు పరచటం ప్రజాస్వామ్యంలో ముఖ్యమైన విషయమని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు తీసుకుని ప్రజలకు పనులు చేసిపెట్టటం వల్ల మొత్తం వ్యవస్థంతా భ్రష్టుపడుతోందన్నారు. చాలామందికి రోజువారీ జీవితం దుర్భరం కావటంతోపాటు, అధికారులు చేయాల్సిన పనులు రాజకీయ పార్టీలు చేస్తూ అవినీతి భారతాన్ని విశృంఖలం చేస్తున్నారన్నారు. అందుకే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి పనికి తప్పనిసరిగా గడువుపెట్టి, ఆలోగా ప్రజలకు పని చేసిపెట్టకపోతే రోజుకు ఇంత డబ్బని జరిమానా చెల్లించేలా హక్కుగా ‘పౌరసేవల’ చట్టాన్ని తీసుకురావాలన్నారు. విద్య, వైద్యం వంటివి కూడా ప్రజలు ప్రభుత్వం నుంచి హక్కుగా పొందాల్సుందన్నారు.

‘మెరుగైన భవిష్యత్తు కోసం’ అంశంపై యూత్ పార్లమెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వీఎన్ఆర్ విజ్ఞాన్‌జ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో జరిగిన చర్చాగోష్ఠిలో జేపీ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) వల్ల ఆశించినంత కాకపోయినా, అవినీతి కేసులు బాగానే బైటపడ్డాయని, 2జీ స్పెక్ట్రం కేసులో ఆర్‌టీఐ సమాచారాన్ని ఉపయోగించే లోక్‌సత్తా అక్రమ కేటాయింపుల్ని రద్దు చేయించగలిగిందని జేపీ అన్నారు. ఆ రోజు ప్రయత్నం వల్లే ఇప్పుడు స్పెక్ట్రం, బొగ్గు గనులు, ఇతర ప్రకృతి వనరుల కేటాయింపులో వేలం పద్ధతి వచ్చి లక్షల కోట్ల ఆదాయం ప్రజాఖజానాకు సమకూరుతోందన్నారు. హక్కుగా పౌర సేవల చట్టం (సర్వీస్ గ్యారంటీ/రైట్ టూ సర్వీసెస్) ఆర్‌టీఐ కన్నా విప్లవాత్మక చట్టమన్నారు. అయితే ఇవి రోగానికి తగిన సమయంలో తగిన మందులే తప్ప సర్వరోగ నివారిణులు కావని, అవినీతి రహిత దేశ సమగ్ర నిర్మాణానికి ఇంకా పలు సంస్కరణలు కావాలని అన్నారు.

సమావేశం అనంతరం కళాశాలలోని రీసెర్చి అండ్ కన్సల్టెన్సీ సెంటర్ నిర్వహించిన ప్రాజెక్ట్ ఎక్స్‌పో ‘ఓపెన్ హౌస్ 2017’ని జేపీ సందర్శించారు. విద్యార్థులు సామాజిక ప్రయోజనమున్న సృజనాత్మక ప్రాజెక్టులు చేపట్టటాన్ని అభినందించారు.

సమావేశంలో విద్యార్థులు, యూత్ పార్లమెంట్ ప్రతినిధులు, అధ్యాపకులు, కళాశాల ప్రిన్సిపల్ సి.డి. నాయుడు పాల్గొన్నారు. విద్యార్థి ప్రతినిధులు బిందు, దిలీప్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

Posting Date 22-03-2017
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on March16th 2017

# పార్టీ మారితే సీటు గోవిందా!

**పార్టీ ఫిరాయింపుల చట్టం కట్టుదిట్టానికి లోక్ సత్తా సూచనల ఫలితంగా సవరణలు చేసారు . అయినా ఇంకా లోసుగులు ఉన్నాయి.**



**ఫిరాయింపుదారులపై వేటు వేసే అధికారం స్పీకర్ కు ఇవ్వొద్దు అని లోక్ సత్తా సూచిస్తోంది. ఎందుకంటే ఈ ఫిరాయింపు డ్రామా స్పీకర్ ముందే నడుస్తూ ఉంటుంది. ఈసీ సిఫార్సు మేరకు ఫిరాయింపుదారులపై గవర్నర్ వేటు వేసేలా చట్టం తేవాలి .**

## నిజాలు మాట్లాడుకుందాం-16

షేర్ చేయండి . ప్రజలకు నిజాలు చేరవేయండి

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B, 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad